# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 9 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 215 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**ఆమె పొడవు 5.5 ఫీట్లు.. జుట్టు 8 ఫీట్లు**



2

**స్పేస్ వాక్ చేసిన అనిల్ మేనన్**



2



## ఐఫోన్ ఉన్నోళ్లకు కూడా ఉచిత బియ్యం ఇస్తున్నరు

- కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంది?
- రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు పథకాలు ఇస్తున్నరు
- సమాజం ప్రమాదంలో పడబోతోంది
- ఉచిత పథకాలపై హైకోర్టు వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగష్టు 8: పరిమితికి మించి అమలు చేస్తున్న ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉచితాలు పంచుతూ ఉంటే కుబేరుడైనా పనికి ఆహారం వంటి పథకం కింద కూలి పనికి వెళ్తాడని... హైకోర్టు వ్యంగ వ్యాఖ్యలు చేసింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల

...మిగతా 2లో





## ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలె

### సమస్యలే సరికొత్త అవకాశాలు కల్పిస్తాయి

- యువత దేశాభివృద్ధి బాధ్యత తీసుకోవాలె
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో విద్యార్థులకు ప్రధాని పిలుపు
- 'పరం ప్రజ్ఞ'ను ప్రారంభించిన మోడీ

ఢిల్లీ, ఆగష్టు 8: దేశ యువతరం సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని ప్రధాని మోడీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా సాగే దేశ ప్రయాణానికి యువత అవసరం ఎంతో ఉందని తెలిపారు. అయితే, ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దని సూచించారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో మోడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ...'ఐఐటీ ఢిల్లీ

...మిగతా 2లో

**ద్రోహులను కలుస్తారు గానీ.. విద్యార్థులను కలిసేందుకు టైము లేదా?: ఠాక్రే**

2

# తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

### పెట్టుబడులతో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కండి

### ప్రవాసులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 8 (మనం బ్యూరో): తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అనువైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవ శాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీతో పాటు ఇతర విద్యా సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందనీ, సంప్రదాయ విద్యుత్‌తో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలోనూ రాష్ట్రం ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా

...మిగతా 2లో

## విద్యార్థులు చెప్పేది ప్రభుత్వం వినాల్సిందే

- ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ప్రోగ్రామ్ 'ఆస్క్ మీ ఎనీథింగ్'లో రాహుల్



ఢిల్లీ, ఆగష్టు 8: యువతకు మరింత చేరువయ్యే ప్రయత్నంలో లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇన్ స్టా గ్రామ్ వేదికగా 'ఆస్క్ మీ ఎనీథింగ్' పేరిట ఒక లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్యమాల నుంచి వ్యక్తిగత అభిరుచుల వరకు నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కొన్నింటికి హాస్యంగా, మరికొన్నింటికి రాజకీయంగా స్పందించారు. లైవ్లో ఒక నెటిజన్ 'మీరు బ్యాట్ మ్యానా?'' అని ప్రశ్నించగా.. ''నన్ను, బ్యాట్ మ్యాన్ను ఒకే గదిలో ఎవరూ చూడలేదు కదా'' అంటూ రాహుల్ చమత్కరించారు. విద్యార్థుల నిరసనల గురించి అడిగిన ప్రశ్నకు.. విద్యార్థులు ఏమి చెబుతున్నారో వినాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు. విద్యార్థుల

...మిగతా 2లో

**డిగ్రీ ఒక్కటే సరిపోదు..**

## నైపుణ్యాలుంటేనే కొలువు

### విద్య, పరిశ్రమ, ఉపాధి అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం

### రూ.2,400 కోట్లతో 65 ఏటీసీల ఏర్పాటు

### 'ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్'లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 8 (మనం న్యూస్): కేవలం మార్కుల మెమోలతో డిగ్రీలు అందించే పాత పద్ధతికి స్వస్తి పలికి.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు గల యువతను తయారు చేసే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఉపాధిని ఒకే వేదికపైకి తెచ్చి యువతను గ్లోబల్ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని రాయదుర్గంలోని టీ-వరక్స్ ప్రాంగణంలో క్వాలిటీ థాట్ ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్-అవార్డ్స్ 2026' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ వంటి వృత్తి విద్యా కోర్సుల ద్వారా 2 లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు వస్తున్నారని, ప్రస్తుత మార్కెట్లో కేవలం డిగ్రీ ఉంటే ఉద్యోగం రాదని మంత్రి తేల్చిచెప్పారు. ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, నిరంతరం నేర్చుకునే తత్వమే పరిశ్రమలకు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాతకాలం నాటి ఐటీఐ కోర్సుల స్థానంలో రోబోటిక్స్, ఆటోమేషన్, ఏఐ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్

...మిగతా 2లో

## మందుబాబులపై ధరల మోత!

- 8 నుంచి 10% వరకు ధరల పెంపు?
- డిస్టిల్లరీల విజ్ఞప్తికి కమిటీ గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే ధరల సవరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిటీ
- మూడేండ్ల తర్వాత ధరల పెంపునకు సిద్ధమైన సర్కార్



2

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

### ఈనెల 20 తరువాత లాటరీ, ఏడాదిలోగా లబ్దిదారులకు

### హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం

హైదరాబాద్, ఆగస్టు 8 (మనం బ్యూరో): అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేద ప్రజలకు సొంతింటిని కల్పించాలన్న లక్ష్యంతో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా నిర్మించనున్న ఫ్లాట్లకు భారీ

...మిగతా 2లో

**భూ సేకరణ, పునరావాసాలకు నిధుల కొరత రానివ్వం**

అనుమతుల పేరుతో పనులు ఆలస్యం కానివొద్దంటూ కలెక్టర్లకు ఆదేశం

మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు పున: ప్రారంభించాలె

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగు నీటి ప్రాజెక్టులపై సమీక్షలో మంత్రి ఉత్తమ్

5

## మూసీ సుందరీకరణకు తొలి అడుగు

### ఫేజ్-1కు పర్యావరణ అనుమతులు

- దసరాలోగా టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎంఆర్డీసీఎల్
- రూ.7,055 కోట్లతో 21కి.మీ. మేర అభివృద్ధి పనులు
- ప్రారంభమైన రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం
- భూసేకరణ, చెట్ల తొలగింపునకు స్పష్టమైన ప్రణాళిక

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న మొదటి దశ (ఫేజ్-1) పనులకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఇటవల ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేసింది. ఈ అనుమతి లభించడంతో, దసరా పండుగలోపే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్డీసీఎల్) కసరత్తు వేగవంతం చేసింది. హైదరాబాద్ నగర

...మిగతా 2లో

## వినియోగదారులకు నో ఛార్జెస్

### యూపీఐ లావాదేవీలపై కేంద్ర ఆర్థికశాఖ స్పష్టత

ఆగస్టు 8: యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థికశాఖ కీలక ప్రకటన చేసింది. వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడించింది. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలన్నీ యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు సంబంధించి

...మిగతా 2లో

### అకాడమిక్-ఇండస్ట్రీ అనుసంధానంతోనే

## వికసిత భారత్ సాకారం

### విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిదాలె

### పాలమూరు యూనివర్సిటీ 'విజన్ ఇండియా 2047' జాతీయ సదస్సులో అకాడమిక్-ఇండస్ట్రీ లైజనింగ్‌పై ప్యానెల్ చర్చ



విద్య, పరిశోధన, పరిశ్రమ, సాంకేతికత, యువశక్తిని సమన్వయం చేయడం ద్వారా మాత్రమే 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న 'విజన్ ఇండియా 2047' రెండు రోజుల జాతీయ సదస్సు రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం పాలమూరు యూనివర్సిటీలో 'అకాడమిక్- పరిశ్రమ అనుసంధానం' అన్న అంశంపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో మాట్లాడిన పలువురు..

...వివరాలు 3లో










# ఆమె పొడవు 5.5 ఫీట్లు.. జుట్టు 8 ఫీట్లు

- **ఇండియన్ యూట్యూబర్ వరల్డ్ రికార్డ్**

**డెహ్రాడూన్, ఆగష్టు 8:** భారత్‌కు చెందిన రేణు ధరియాల్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన జుట్టు ఉన్న మహిళగా కొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏప్రిల్ నెలలో ఈ రికార్డును అధికారికంగా ధృవీకరించారు. యూట్యూబర్, కంటెంట్ క్రియేటర్ అయిన రేణు ధరియాల్ నల్లని జుట్టు పొడవు 271.50 సెంటీమీటర్లు అంటే 8 అడుగుల 10 అంగుళాలు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వ్యక్తి రాబర్ట్ వాడ్లో ఎత్తు (272 సెం.మీ) కంటే స్వల్పంగా మాత్రమే తక్కువ. గతంలో ఉక్రెయిన్‌కు చెందిన అలియా నాసిరోవా పేరిట ఉన్న 257.33 సెం.మీ (8 అడుగుల 5.3 అంగుళాలు) రికార్డును రేణు బద్దలు కొట్టారు. రేణు 2015 నుంచి తన జుట్టును ఒక్కసారి కూడా కత్తిరించకుండా చాలా జాగ్రత్తగా పెంచుతున్నారు.

**10 ఏళ్ల శ్రమ**

భారతీయ సంస్కృతిలో పొడవైన జుట్టును అత్యంత సౌందర్యానికి, సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని, అదే తనకు ప్రేరణనిచ్చిందని ఆమె తెలిపారు. నేలపై పడకుండ, చిక్కులు పడి ఊడిపోకుండా ఉండటానికి ఆమె పెద్ద జడగా వేసుకుంటారు. ఇంత పొడవైన జుట్టును నిర్వహించడం చాలా ఓర్పుతో కూడుకున్న పని అని, జుట్టును శుభ్రం చేయడానికి చిక్కులు తీయడానికి గంటల సమయం పడుతుందని రేణు వెల్లడించారు. రసాయనాలు ఉన్న ప్రొడక్ట్స్ వాడకుండా, ఇంట్లోనే తయారుచేసుకునే సహజసిద్ధమైన నూనెలు, షాంపూలను ఉపయోగిస్తానని, జుట్టును శుభ్రం చేయడానికి, చిక్కులు తీయడానికి ఎంతో సమయం, ఓర్పు అవసరమని ఆమె చెప్పారు. భారతీయ సంస్కృతిలో పొడవైన జుట్టు అందానికి, సంప్రదాయానికి ప్రతీక అని, పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వడమే తన లక్ష్యమని రేణు ప్రకటించారు.

# స్పేస్ వాక్ చేసిన అనిల్ మేనన్

**వాషింగ్టన్, ఆగష్టు 8:** భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ శుక్రవారం విజయవంతంగా స్పేస్‌వాక్ నిర్వహించారు. మరో ఆస్ట్రోనాట్ జెస్సికా మెయిర్‌తో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోని పవర్ ఛానల్‌కు ఒక మోడిఫికేషన్ కిట్‌ను అమర్చారు. దీనివల్ల ఈ కేంద్రానికి మరిన్ని సౌరఫలకాలను అమర్చుకోవచ్చు. దాదాపు ఆరున్నర గంటల పాటు ఈ స్పేస్‌వాక్ సాగింది. ఈ మధ్యలో స్వల్ప విరామంలో అనిల్, జెస్సికాల మధ్య సరదా సంభాషణ జరిగింది. 'అనిల్.. మీరు చందమామను చూడొచ్చు' అని జెస్సికా పేర్కొన్నారు. దానికి అనిల్ స్పందిస్తూ.. ''నాకు కుడివైపున చంద్రుడిని చూస్తున్నా. నాకు అక్కడ భావి చందమామ ఆవాసం కనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. ఈ నెల 13న ఈ ఇద్దరు వ్యోమగాములు మరోసారి స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

# ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలె

(మొదటి పేజీ తరువాయి)

గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది. ఇప్పుడు చదువు పూర్తిచేసుకుని మీరు అడుగుపెట్టే బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది. సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే 20-30 ఏళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి. నిత్య విద్యార్థిలా నేర్చుకోవాలి.

అలాంటి వారే విజేతలుగా నిలుస్తారు' అని ప్రధాని చెప్పారు.

మార్పు అనేది సవాళ్లు, అవకాశాలతో కూడుకుని ఉంటుంది. జీవితం మనకు ఎన్నో సమస్యలు తీసుకొస్తుంది. కానీ, ఆ సమస్యలే అవకాశాలు కల్పిస్తాయి. మీకు పెద్ద సవాలు ఎదురైనప్పుడు దాన్ని చూసి భయపడకండి. దాన్ని చిన్న చిన్న భాగాలుగా విడదీసి చూడండి. కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదు. అందుకే, ప్రశ్నించడం కాదు.. సమస్యకు పరిష్కారం కనుగొనడంపై దృష్టిపెట్టాలి'' అని మోడీ సూచించారు.''ప్రతి తరానికి జాతీయ బాధ్యత ఉంటుంది. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కూడా భాగస్వామి కావాలి. వచ్చే 30-35 ఏళ్లలో మీరు ఏం చేస్తున్నారన్నదే.. వికసిత్ భారత్ ను నిర్ణయిస్తుంది. అందువల్ల మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరే.. ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనేది ఆలోచించాలి.

# ద్రోహులను కలుస్తారు గానీ.. విద్యార్థులను కలిసేందుకు టైము లేదా?

## ప్రధానికి ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్న

**ముంబై, ఆగష్టు 8:** తమ పార్టీని వీడి శిందే నేతృత్వంలోని శివసేనలో చేరిన తిరుగుబాటు ఎంపీలతో శుక్రవారం ప్రధాని మోడీ సమావేశం కావడంపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీక్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న యువతను కలవడానికి సమయం లేని ప్రధాని.. ద్రోహులను కలవడానికి మాత్రం సమయం కేటాయించారని దుయ్యబట్టారు. శిందే వర్గానికి చెందిన పార్టీనే అసలైన శివసేనగా గుర్తిస్తూ.. ఎన్నికల కమిషన్ చేసిన ప్రకటనపై ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమను భయపెట్టాలనే ఉద్దేశంతోనే అండగా ఉంటామని మోడీ వారికి హామీ ఇస్తున్నారని ఉద్ధవ్ అన్నారు.కోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగా ఉంటుందన్నదే తన ఏకైక ఆశ అని.. ఆ విషయంలో తనకు పూర్తి నమ్మకం ఉందని ఠాక్రే పేర్కొన్నారు. మరోవైపు ప్రత్యర్థి శివసేనలో ఆరుగురు ఎంపీల విలీనాన్ని గుర్తిస్తూ లోక్ సభ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చే కేంద్ర ప్రభుత్వాన్ని కుదిపేసిన ఇటీవలి జెన్ జీ నిరసనల పరిణామాలతో దేశంలోని ప్రస్తుత పరిస్థితులు తుపానుకు ముందు ప్రశాంతతే అని పేర్కొన్నారు.

# తగ్గుతున్న వీసాలు



- **భారత విద్యార్థుల 'అమెరికా డ్రీమ్'కు ఇమ్మిగ్రేషన్ కత్తెర**

**ఢిల్లీ, ఆగష్టు 8:** అమెరికాలో చదువుకోవాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. 2025 బిజీ అడ్మిషన్ సీజన్లో మన విద్యార్థులకు వీసా అనుమతులు గణనీయంగా తగ్గాయి. చైనాతో పోలిస్తే భారతీయులకు స్టూడెంట్ వీసా నిరాకరణలు దాదాపు రెట్టింపుగా ఉండటం గమనార్హం. ఈ మేరకు అమెరికాలోని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ (సీఐఎస్) అధ్యయనం వెల్లడించింది. 2025 మే-ఆగస్టు మధ్యలో అమెరికా కాన్సులేట్లు భారతీయ విద్యార్థులకు 22,149 ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు జారీ చేశాయి. 2024లోని ఇదే కాలానికి మన వాళ్లకు 58,694 విద్యార్థి వీసాలు జారీ అవ్వగా.. గతేడాది ఆ సంఖ్య 62 శాతం మేర తగ్గింది. సాధారణంగా ఏటా ఈ సీజన్లో భారతీయులకు సగటున 50వేల పైనే విద్యార్థి వీసాలు వస్తాయి. కానీ, గతేడాది ఈ సంఖ్యలో భారీ తగ్గుదల కన్పించడం ఆందోళన కలిగిస్తోంది.

**అయినా మనదే టాప్ ప్లేస్...**

మనకు విద్యార్థి వీసాల అనుమతులు భారీగా తగ్గినప్పటికీ.. అమెరికా విద్యాసంస్థల్లో నమోదు చేసుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గణాంకాల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో 3,63,019 మంది భారత విద్యార్థులు యూఎస్ కాలేజీలు, యూనివర్సిటీల్లో చేరారు.

# 4 వేల మంది భారత నావికులను సురక్షితంగా తీసుకొచ్చాం

## వెల్లడించిన షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్

**ఢిల్లీ, ఆగష్టు 8:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జల మార్గాల్లో చిక్కుకుపోయిన నాలుగు వేల మందికిపైగా భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చామని కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. నావికుల భద్రత, సంక్షేమానికి సంబంధించి ముంబయిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ప్రతి నావికుడికి సంబంధించిన వివరాలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ అందుబాటులో ఉంచుతామన్నారు. 'అంతర్జాతీయంగా సముద్రజలాల్లో ఉన్న నౌకల్లోని ప్రతి ఒక్క భారతీయ నావికుడు సురక్షితంగా ఉండేలా చూడటం మా లక్ష్యం. ఇప్పటివరకు 4048 మందిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చాం. వారి కుటుంబాలకూ అండగా నిలిచాం'' అని కేంద్ర మంత్రి వెల్లడించారు. సంక్షోభ సమయంలో నావికులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు విదేశాంగశాఖ, ఆయా దేశాల్లోని దౌత్య కార్యాలయాలు, భారత నౌకాదళం, నౌకల యజమానులు సహా ఆయా విభాగాలు కృషి చేశాయన్నారు. నావికులు, షిప్పింగ్ కంపెనీలు, పోర్టులు, వివిధ భాగస్వామ్య పక్షాలకు సేవలందించేందుకు ఈ-సముద్ర పేరుతో డిజిటల్ వేదికను త్వరలో అందుబాటులోకి తేనున్నామని వివరించారు.

# డిగ్రీ ఒక్కటే సరిపోదు.. నైపుణ్యాలుంటేనే కొలువు

(మొదటి పేజీ తరువాయి)

లాంటి ఆధునిక కోర్సులను తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. టాటా సన్స్ సహకారంతో రూ.2,400 కోట్ల వ్యయంతో 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దుతున్నామని, మొదటి రోజు నుంచే పరిశ్రమల్లో పనిచేసేలా యువతను ఇక్కడ సిద్ధం చేస్తామని శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.

**స్కిల్స్ యూనివర్సిటీ దేశానికే రోల్ మోడల్**

ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' దేశంలోనే నైపుణ్యాభివృద్ధికి కొత్త నమూనాగా నిలుస్తుందని శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మాత్రమే ఉంటుంది.. పరిశ్రమే ఈ వ్యవస్థకు కేంద్రంగా ఉండి కోర్సులు రూపొందిస్తుంది' అని తెలిపారు. ప్రతి విద్యార్థి డిగ్రీతో పాటు ఏఐ, డేటా సైన్స్, సెమీకండక్టర్లు, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో కనీసం ఒక నైపుణ్యమైనా సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల స్వరూపం మారినప్పటికీ, కొత్త వృత్తులు, భారీ అవకాశాలు వస్తాయని మంత్రి విశ్లేషించారు. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగంలో 20 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు పరిశ్రమల భాగస్వామ్యంతో ఉపాధి ఆధారిత శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

**డిజిటల్ మౌలిక వసతులు:**

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ నేడు హైదరాబాద్‌కు లైఫ్‌లైన్‌గా మారిందని మంత్రి గుర్తుచేశారు. అదేవిధంగా ఇప్పుడు గ్రామాలకు విస్తరిస్తున్న ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధికి కీలకం కాబోతోందన్నారు. టియర్-2, టియర్-3 పట్టణాల అభివృద్ధి ద్వారా యువత తమ స్వస్థలాల నుంచే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 'క్లాస్రూమ్, వర్క్‌లెస్ వేర్వేరు ప్రపంచాలుగా ఉండకూడదు' అని పేర్కొంటూ విద్యావ్యవస్థలో పరిశ్రమలు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్ నిర్వాహకులు రమణ, క్రిష్, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తణికెళ్ల, టాస్క్ సీఈవో నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూసీ సుందరీకరణకు తొలి అడుగు

(మొదటి పేజీ తరువాయి)

రూపురేఖలను మార్చే ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర 'వి' ఆకారంలో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. దీని కోసం మొత్తం రూ. 7,055 కోట్లు ఖర్చు చేయనుండగా, పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండేళ్లలోగా, అంటే 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఈ నిధులతో నదికి ఇరువైపులా 30 మీటర్ల వెడల్పుతో రోడ్లు, సర్వీసు రోడ్లు, ఫుట్పాత్లు నిర్మిస్తారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు, పంపింగ్ స్టేషన్లు, వరద నియంత్రణకు చెక్ డ్యాములు ఏర్పాటు చేస్తారు. వీటికి తోడు పచ్చటి కారిడార్లు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. నదిలో సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా వర్షాకాలంలో 30 శాతం, ఇతర సమయాల్లో 20 శాతం నీటి ప్రవాహం ఉండేలా చూడనున్నారు.

మొదటి దశ కోసం మొత్తం 495 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 158 ఎకరాల ప్రభుత్వ, 146 ఎకరాల పట్టా, 30 ఎకరాల రక్షణ శాఖ భూములతో పాటు 126 ఎకరాల నదీ పరివాహక ప్రాంతం ఉంది. ఈ పరిధిలో 639 శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే 2,660 చెట్లలో చాలావాటిని మరోచోటికి తరలించనున్నట్లు, తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే 1:10 నిష్పత్తిలో కొత్త మొక్కలు నాటనున్నట్లు అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. మొత్తం మీద, కీలకమైన పర్యావరణ అనుమతులు లభించడంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానుండటంతో హైదరాబాద్ మహానగరానికి ఇది కొత్త శోభను తీసుకురానుందని ప్రభుత్వం భావిస్తోంది.

# తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడ కూడా ఆలస్యం జరుగకుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారిందనీ, ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలనీ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి తెలంగాణ ప్రవాసులకు పిలుపునిచ్చారు.

# ఐఫోన్ ఉన్నోళ్లకు కూడా ఉచిత బియ్యం ఇస్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని 2024లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె. రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేండ్లయింది. కానీ, ఇంతవరకు సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ 'అధికారులు ఏం చేయగలరు? మనకు వచ్చే ఆదాయమెంత. ఖర్చెంత? రాష్ట్ర బడ్జెట్లో జీతాలు, అప్పులకూ పోను.. మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించే పరిస్థితి. లబ్ధిదారులు బైక్, ఐఫోన్ తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంటి? ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది? భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది' అని ప్రశ్నిం

**ఒక్క తెల్లకార్డునైనా తొలగించగలరా?**

రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. ''ఒక తెల్లకార్డునైనా తొలగించగలరా? అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుంది. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయి. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే ముఖ్యమంత్రి అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇది దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ప్రభుత్వాలే తెలుసుకోవాలి'' అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతూ విచారణను 19కి వాయిదా వేసింది.

# చదువయ్యాక తిరిగొచ్చేస్తం

## 81% మంది భారత విద్యార్థులది ఇదే మాట

## ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ 'స్టూడెంట్ గ్లోబల్ మొబిలిటీ ఇండెక్స్' సర్వే నివేదిక



**లండన్, ఆగష్టు 8:** విదేశాల్లో ఉన్నత విద్య చదవాలన్న ఆసక్తి చూపుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగు తున్న విషయం తెలిసిందే. అయితే, వివిధ దేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో 81శాతం మంది చదువు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. విదేశీ విద్యపై నిర్ణయాలు, కోర్సుల ఎంపిక, ఉద్యోగాల కోసం దరఖాస్తు, ఆయా నిర్ణయాల్లో కుటుంబాల ప్రభావానికి సంబంధించి 'స్టూడెంట్ గ్లోబల్ మొబిలిటీ ఇండెక్స్' పేరుతో ఆక్స్ ఫర్డ్ ఇంటర్నేషనల్ చేపట్టిన సర్వేలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మొత్తం 17,925 మందిని సర్వే చేశారు. ప్రతి పది మందిలో తొమ్మిది మంది వారి కుటుంబంలో విదేశాల్లో విద్యను అభ్యసించే తొలి వ్యక్తి తామేనని వెల్లడించారు. విదేశాలకు వెళ్లాలనేది తమ సొంత నిర్ణయమని దాదాపు సగం (49శాతం) మంది విద్యార్థులు చెప్పారు. మూడేళ్ల క్రితం జరిపిన సర్వేలో (2023-24లో) వీరి సంఖ్య కేవలం 29శాతంగా ఉంది. ఇటువంటి నిర్ణయాలపై కుటుంబీకుల ప్రభావం తగ్గుతూ వస్తోందని తెలుస్తోంది.చదువులు పూర్తైన తర్వాత స్వదేశానికి తిరిగి రావాలని సర్వేలో పాల్గొన్న వారిలో 81శాతం చెప్పడం గమనార్హం. సర్వేలో పాల్గొన్న ప్రతి పది మందిలో ఏడుగురు మాస్టర్స్ లేదా పీజీ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కువ మంది బిజినెస్ అండ్ మేనేజ్ మెంట్ రంగాన్ని ఎంచుకుంటుండగా.. హెల్త్ అండ్ మెడిసిన్, సైన్స్, ఇంజినీరింగ్ విభాగాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# మందుబాబులపై ధరల మోత!

- **8 నుంచి 10 శాతం వరకు ధరల పెంపు?**
- **డిస్టిల్లరీల విజ్ఞప్తికి కమిటీ గ్రీన్ సిగ్నల్**
- **ఇప్పటికే ధరల సవరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిటీ**
- **మూడేండ్ల తర్వాత ధరల పెంపునకు సిద్ధమైన సర్కార్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల బ్రాండ్ల ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన సబ్-కమిటీ, సవరించిన ఎంఆర్‌పీ ధరలతో కూడిన నివేదికను గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన తర్వాత ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.తెలంగాణలో త్వరలోనే మద్యం ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో చివరిసారిగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలను సవరించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ధరలను సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా పెంపుదల లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మద్యం తయారీ సంస్థలు (డిస్టిలరీలు) ప్రభుత్వానికి విన్నవించాయి. ముడిసరుకుల ధరలు, రవాణా ఛార్జీలు, సిబ్బంది జీతాలు, పన్నుల భారం గణనీయంగా పెరిగిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'ధరల నిర్ణయ కమిటీ'ని ఏర్పాటు చేసి, డిస్టిలరీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీ ఈ నివేదికను రూపొందించింది.



ప్రస్తుత పరిస్థితుల్లో కరెంట్, రవాణా చార్జీలు, గ్లాస్ బాటిళ్లు, కార్టన్ బాక్సుల ధరలు పెరగడంతోపాటు మద్యం తయారీకి ఉపయోగించే రెక్టిఫైడ్ స్పిరిట్, ధాన్యాల వంటి ముడిసరుకుల వ్యయం కూడా పెరిగిందని డిస్టలరీలు ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకెళ్లాయి. కూలీల వేతనాలు పెరగడంతో పాత ధరలకే డిపోలకు మద్యం సరఫరా చేయడం కష్టంగా మారిందని, 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని డిస్టిలరీలు డిమాండ్ చేస్తుండగా.. ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ ధరల సవరణకు సిఫారసు చేసినట్లు సమాచారం. దీనికి తోడు ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు ఎక్సైజ్ డ్యూటీని కూడా పెంచే అంశాన్ని అబ్కారీ శాఖ పరిశీలిస్తోంది. రెండు ప్రతిపాదనలపై నివేదికలు సిద్ధమవుతున్నాయి. సీఎం ఆమోదం లభిస్తే మద్యం ధరల పెంపుపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. దీంతో ఎంతో కొంత 8 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని డిస్టిలరీ సంస్థలు బావిస్తున్నారు. అయితే, ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. మద్యం ధరలను భారీగా పెంచితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది. అందుకే, పొరుగు రాష్ట్రాల్లోని ధరలతో పోల్చి చూసిన తర్వాత ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఎక్సైజ్ సుంకాలను పరిశీలిస్తున్న అధికారులు.. తెలంగాణలో పన్నుల శ్లాబులను సవరించడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే అదనపు ఆదాయాన్ని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాతే పెంపుదల శాతాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సబ్-కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించాక.. ఈ రెండు ప్రతిపాదనలను త్వరలో ముఖ్యమంత్రి ఆమోదానికి పంపనున్నారు. సీఎం ఆమోదం లభిస్తే ధరల పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటిసతే?.. అబ్కారీ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

# వినియోగదారులకు నో ఛార్జెస్

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక శాతం యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని.. భవిష్యత్తులో ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) అమల్లోకి వచ్చినా అందరిపై ఏకపక్షంగా ఉండదని పేర్కొంది. మర్చంట్ లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్ ఉంటుందని తెలిపింది. డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే ఈ ఛార్జ్ తక్కువ ఉంటుందని తెలిపింది. ఎంపిక చేసిన డిజిటల్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) ఛార్జీ విధించేందుకు బ్యాంకులు, చెల్లింపుల సేవా సంస్థలకు అధికారం కల్పించే సవరణ బిల్లుకు లోక్సభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ రుసుముల విధింపును అడ్డుకునే పాత నిబంధనలను తొలగించారు. దీంతో యూపీఐ లావాదేవీలన్నింటిపై ఛార్జీలు పడతాయనే పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.



# విద్యార్థులు చెప్పేది ప్రభుత్వం వినాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనల్లో తనకు నచ్చిన మీమ్ ఏదన్న ప్రశ్నకు వ్యంగ్యంగా స్పందిస్తూ.. 'అర్ధరాత్రి ప్రధానమంత్రి నివాసం నుంచి వచ్చిన వీడియోలే ఉత్తమమైనవి. అవి ఆందోళనలో ఉన్న కొత్త ప్రధాన్ని చూపించాయి' అని చెప్పారు. ఈ లైవ్ సెషన్లో ఆయన తన తల్లి సోనియా గాంధీ పెంపుడు కుక్క 'నూరీ'ని కూడా ప్రేక్షకులకు పరిచయం చేశారు. బీజేపీలో మీకు ఇష్టమైన నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు.. 2022లో కాంగ్రెస్ ను వీడి బీజేపీలో చేరిన పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ పథకం కింద మొత్తం ఒక లక్ష ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇంతవరకు ఈ ఇండ్లకోసం శనివారం నాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని ఈ నెల పదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ బోర్డు చైర్మన్ పివి గౌతం తెలిపారు. దరఖాస్తుదారులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈనెల 20న చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులను చేపట్టడానికి టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభించామనీ, ఈ ఇండ్లన్నీ ఏడాదిలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా గౌతం వెల్లడించారు.



## బీసీ విద్యార్థులకు ఉచితంగా నీట్, జేఈఈ లాంగ్‌టర్మ్ కోచింగ్

- మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- నేటి నుంచి ఈ నెల 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 9 (మనం న్యూస్): జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్ , జేఈఈ రాసే బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సువర్ణావకాశం కల్పించింది. ఈ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించేందుకు వీలుగా ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి సంబంధించి మిగిలిపోయిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

**శిక్షణ కేంద్రాలు - ఖాళీల వివరాలు:**

బాలురకు నాగోల్ (హైదరాబాద్) లోని సీఓఈ కేంద్రంలో శిక్షణ ఇస్తారు. ఇందులో నీట్‌కు 100, జేఈఈకి 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి.అలగే బాలికలకు అబ్దుల్లాపూరమేట్ మండలం బాటసింగారంలోని వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గల సీఓఈ కేంద్రంలో శిక్షణ ఉంటుంది. ఇందులో నీట్‌కు 50, జేఈఈకి 50 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**అర్హతలు, ఎంపిక విధానం:**

గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంత విద్యార్థుల ఆదాయం రూ.2,00,000 మించకూడదు. ప్రవేశాలు పూర్తిగా మెరిట్, సీట్ల లభ్యత ఆధారంగానే ఉంటాయి. ఒకవేళ దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉంటే స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని,దరఖాస్తుల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కాగా,ఈనెల 16 చివరి తేదీగా నిర్ణయించారు. ఇతర పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను చూడవచ్చని లేదా 040-23328266 నంబరును సంప్రదించవచ్చని గురుకుల సంస్థ ప్రకటనలో పేర్కొంది.

# అకాడమిక్-ఇండస్ట్రీ అనుసంధానంతోనే వికసిత భారత్ సాకారం

### విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలె

### పాలమూరు యూనివర్సిటీ 'విజన్ ఇండియా 2047' జాతీయ సదస్సులో అకాడమిక్-ఇండస్ట్రీ లైజనింగ్‌పై ప్యానెల్ చర్చ



**ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 8 (మనం బ్యూరో):** విద్య, పరిశోధన, పరిశ్రమ, సాంకేతికత, యువశక్తిని సమన్వయం చేయడం ద్వారా మాత్రమే 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న 'విజన్ ఇండియా 2047' రెండు రోజుల జాతీయ సదస్సు రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం పాలమూరు యూనివర్సిటీలో 'అకాడమిక్- పరిశ్రమ అనుసంధానం' అన్న అంశంపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో మాట్లాడిన పలువురు.. దేశ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో అందించే విద్య పరిశ్రమలలో వస్తున్న మార్పులు, సాంకేతిక అభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా ఉండాలని వారు సూచించారు. ఈ ప్యానెల్ చర్చకు ఓయూ కామర్స్ ప్రొఫెసర్ పాట్రిక్ మోడరేటర్ గా వ్యవహరించారు. డా. ఎన్. రాజేందర్, సీనియర్ సైంటిస్ట్, నిన్ , పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాల మధ్య మరింత బలమైన భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, పరిశోధన ఫలితాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజ్ డీన్ డా. జోషి.. వైద్య విద్య, పరిశోధన, ఆరోగ్య రంగంలో పరిశ్రమల సహకారం ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక సాంకేతికతను వైద్య విద్యతో అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్ వైద్య నిపుణులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. బిట్స్ పిలాని ప్రొఫెసర్ సాయి ప్రసాద్, ఉన్నత విద్యలో నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు కేవలం డిగ్రీ పొందడమే లక్ష్యంగా కాకుండా, సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కోడ్ తంత్ర కో-ఫౌండర్, సీఈఓటి ఎస్వీ రమణ.. పరిశ్రమలలో మారుతున్న అవసరాలు, సాంకేతిక నైపుణ్యాల ప్రాధాన్యత, విద్యార్థుల్లో ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్ పెంపొందించాల్సిన అవసరంపై వివరించారు. విద్యాసంస్థలు పరిశ్రమలతో నిరంతర సంభాషణ కొనసాగించడం ద్వారా విద్యార్థులను ఉద్యోగ మార్కెట్కు మరింత సమర్థవంతంగా సిద్ధం చేయవచ్చని పేర్కొన్నారు.

**కరిక్యులమ్‌లో ఇండస్ట్రీ అవసరాలకు స్థానం..**

దీనికోసం విశ్వవిద్యాలయాలు, కళాశాలలు తమ కరిక్యులమ్ ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ లు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు తరగతి గది విద్యతో పాటు పరిశ్రమలలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే అవకాశం కల్పించేందుకు ఇంటర్న్ షిప్ లు, ఇండస్ట్రీ విజిట్లు, లైవ్ ప్రాజెక్టులు, ఇండస్ట్రీ మెంటరింగ్, ప్రాక్టికల్ ట్రైనింగ్ వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజానికి, పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా ఉండాలని నిపుణులు సూచించారు.

**యువతే వికసిత భారత్ కు చోదక శక్తి..**

2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్ , ప్రాబ్లెమ్ సొలవింగ్ , క్రియేటివిటీ , కమ్యూనికేషన్ స్కిల్స్ , లీడర్షిప్ స్కిల్స్ , డిజిటల్ స్కిల్స్ వంటి నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

**ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చి దిద్దాలె..**

యువతను కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థితి నుంచి ఉద్యోగాలను సృష్టించే స్థాయికి తీసుకెళ్లేందుకు విశ్వవిద్యాలయాలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని నిపుణులు సూచించారు. స్టార్టప్లు, ఇన్నోవేషన్, ఎంటర్ప్రెన్యూర్షిప్, టెక్నాలజీ ఆధారిత వ్యాపార ఆలోచనలను విద్యార్థుల్లో ప్రోత్సహించడం ద్వారా యువతలో స్వయం ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి వారిని తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించేందుకు పాలమూరు యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

### క్షుద్ర పూజల పేరుతో కాంగ్రెస్ నేతలు

# చిల్లర రాజకీయాలు

### మాకు క్షుద్ర రాజకీయాలే తెలియవు? ● యాగాల్లో కేసీఆర్ నంబర్‌వన్

### ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రంగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది : కేటీఆర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తనదైన శైలిలో తీవ్రంగా మండిపడ్డారు. క్షుద్ర పూజల పేరుతో నీచ రాజకీయాలు చేయ్యొద్దని హితవు పలికారు. తమకు ఏలాంటి క్షుద్ర రాజకీయాలు తెలియవని ఆయన పేర్కొన్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ నేతలు క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ... మాజీ మంత్రి హరీశ్‌రావు గుడికి వెళ్లడం తప్పా? అని ఆయన ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్రం కోసం.. రాష్ట్ర స్వాప్నికుడు, ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అబద్దాలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదని ఆయన దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణకు దక్కాల్సిన నీటిని అక్రమంగా తరలిస్తుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

### బీసీ సమస్యల పరిష్కారానికి

# ఐక్యంగా ముందుకు సాగాలి

### జ్యోతిబాపూలే, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణల తేదీలు ఖరారు

### సీఎం రేవంత్ రెడ్డి, బీసీ ముఖ్య నేతలను ఆహ్వానించాలని నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 8(మనం బ్యూరో):** బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణల సభలు విజయవంతం చేసేలా ప్రజా ప్రతినిధులు కుల సంఘాలు పాల్గొన్నాలని కోరారు. శనివారం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా ప్రత్యేక కార్యాచరణపై మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కేకే, మాజీ ఎంపీ వీహెచ్‌తో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలను ఈనెల 14న, ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఈనెల 18న ప్రారంభించే కార్యక్రమంపై చర్చించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను కలిసి ఆహ్వానించాలని నిర్ణయించారు. సీఎంను కలిసి బీసీ వర్గాల సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చర్చించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినప్పటికీ బీసీ వర్గాల ఆకాంక్షలు, లక్ష్యాలు పూర్తి స్థాయిలో నెరవేరలేదనే అభిప్రాయంతో తదుపరి కార్యాచరణపై ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. అలాగే, బీసీ కమిషన్‌ను మరింత బలోపేతం చేసి బీసీల సమస్యల పరిష్కారంలో కమిషన్‌కు అవసరమైన సహకారం అందించాలని చర్చించారు. బీసీ వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బీసీ సంక్షేమ శాఖకు అవసరమైన నిధులు కేటాయించి సంక్షేమం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

# స్కూల్ ఫీజులు వెబ్‌సైట్‌లో పెట్టాల్సిందే

### ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశాలు

### గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో ఫీజు నిర్ణయించాలి?

### వివరాలు సమర్పించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులివ్వండి

### ఆర్‌జేడీలు, డీఈఓలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు 2026-27 విద్యా సంవత్సరంలో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను తరగతుల వారీగా పాఠశాల విద్యాశాఖ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో ఫీజు నిర్ణయానికి సంబంధించిన పత్రాలను కూడా అప్ లోడ్ చేయాలన్నారు. వివరాలు సమర్పించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆర్‌జేడీలు, డీఈఓలను ఆదేశించారు. అయితే పలు ఆదేశాలకు తుది గడువు లేకపోవడం అమలుపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరం (2026-27) విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను తరగతుల వారీగా ప్రభుత్వ వెబ్సైట్లో అందుబాటులో ఉంచాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఇటీవల తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆయా పాఠశాలల సొంత వెబ్ సైట్‌లో ఫీజుల వివరాలను ఉంచాలని ఆదేశించగా.. తాజాగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్ సైట్‌లోనే వివరాలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఫీజుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు పాఠశాల విద్యాశాఖ వెబ్ సైట్‌లో ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి తరగతికి నిర్ణయించిన ఫీజుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

తరగతుల వారీగా ఫీజులనుఎలా నిర్ణయించారో తెలియజేసే సంబంధిత పత్రాలను కూడా అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల పాలకమండలి సభ్యుల సంతకాలతో ఉన్న పత్రాలనే సమర్పించాలని స్పష్టం చేసింది. కేవలం ఫీజు మొత్తాలను మాత్రమే కాకుండా.. ఆ ఫీజు నిర్ణయానికి సంబంధించిన ఆధారాలను కూడా అందుబాటులో ఉంచడం ద్వారా ప్రక్రియలో పారదర్శకత పెంచాలని శాఖ భావిస్తోంది. ప్రైవేటు పాఠశాలలు ఫీజుల వివరాలను ప్రభుత్వ పోర్టల్లో అప్‌లోడ్ చేశాయా? లేదా? అన్నదానిపై పర్యవేక్షణ చేపట్టాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత వివరాలను అప్‌లోడ్ చేయని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అయితే పాఠశాల విద్యాశాఖ జారీ చేస్తున్న పలు ఆదేశాల్లో తుది గడువు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. గడువు నిర్దేశించకపోవడంతో కొన్ని ఆదేశాలను అధికారులు, స్కూల్ ప్రతినిధులు తీవ్రంగా పరిగణించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫీజుల వివరాల అప్‌లోడ్‌కు కూడా స్పష్టమైన చివరి తేదీని ప్రకటించకపోవడం ఇదే తరహాలో ఉందని విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పాఠశాలల ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికలను సమర్పించాలని గత నెలలో విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఆ నివేదికలను సమర్పించిన పాఠశాలల సంఖ్య నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరుగుతున్నప్పటికీ.. తుది గడువు లేకపోవడం వల్ల చర్యలు తీసుకోవడంలోనూ కొంత ఆలస్యం జరుగుతోందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు సంబంధించి టీచర్ల నియామక ఉత్తర్వుల్లోనూ నిర్దేశిత గడువు పేర్కొనలేదు. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు రెండు నెలలు గడుస్తున్నా.. కొన్ని జిల్లాల్లో ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు ఇంకా పూర్తికాలేదు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల వివరాలను ప్రభుత్వ వెబ్ సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయించే చర్యతో ఫీజుల విషయంలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో పాఠశాలలు ఆదేశాలను నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణను మరింత పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నేడు పెద్ది ఇంటికి పెద్దాయన

### దివంగత నేత కుటుంబ సభ్యులను పరామర్శించనున్న కేసీఆర్

### సుదర్శన్ రెడ్డి కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం

**ఉద్యమ నేత పెద్దిపై.. గులాబి దళపతి, ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి పెద్ద మనసు చాటనున్నారు. ఉద్యమంలో తనతో కలిసి నడిచిన అత్యంత ఆప్తుడు, ముఖ్య అనుచరుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆనారోగ్యంతో కానరాని లోకాలకు వెళ్లిన తీరు, పెద్ది మరణం కేసీఆర్‌ను తీవ్రంగా కలిచివేసింది. దీంతో పెద్ది ఇంటికి పెద్దాయన వెళ్లనున్నారు. ఆ దివంగత నేత కుటుంబ సభ్యులను నేడు కేసీఆర్ పరామర్శించనున్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన వారి కుటుంబానికి పిల్లల చదువు, ఆయన తల్లి బాగోగుల కోసం ఆర్థిక సాయంకై, ఇప్పటికే రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించిన కేసీఆర్.. ఉద్యమ నేత కుటుంబానికి పార్టీ అండగా నిలిచేందుకు గులాబీ బాస్ కేసీఆర్, అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నట్లు అటు ఉద్యమకారులతో పాటు ఇటు కారు పార్టీ నేతలు చెప్తున్నారు.**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పుట్టిన పార్టీకి.. ఆవిర్భావం నుంచి తనకు అత్యంత ఆప్తుడిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబాన్ని స్వయంగా పరామర్శించనున్నారు. ఇందుకోసం నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి నేడు(ఆదివారం) ఆయన వెళ్లనున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో పార్టీ ఎల్లవేళలా తోడుగా ఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు.

**పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయంతో పెద్ద మనసు..**

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు.

ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనుండగా, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలను ఆమె పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. చేయనున్నారు. పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేసీఆర్ భరోసా ఇవ్వనున్నారు. వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు పూర్తైన తర్వాత జిల్లా ముఖ్య నేతలతో సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన చర్యల అమలుపై, నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలిసి కేసీఆర్ ధైర్యం చెప్పనున్నారు.

### మేమూ సొంతంగానే

# పోటీ చేస్తాం

### జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్న బీజేపీకి, జనసేన తెలంగాణ చీఫ్ శంకర్ గౌడ్ కౌంటర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో పొత్తులపై జనసేన రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శంకర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తుల అంశాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకులు నిర్ణయిస్తారని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకునే విషయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిధిలోని అంశం పరిధిలోనిది కాదని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీతో పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన సొంతంగా ఎన్నికల బరిలోకి దిగుతుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జనసేనకు ఆదరణ క్రమంగా పెరుగుతోందని చెప్పారు. పవన్ కల్యాణ్ మంచి పనులు చేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని.. దీంతో ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

ఇదిలాఉంటే, మరోవైపు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కూడా పొత్తులపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అయితే, జాతీయ స్థాయిలో బీజేపీ, జనసేన మిత్రపక్షాలుగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో మాత్రం రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అన్నదానిపై ప్రస్తుతం స్పష్టత లేదు.

# మెడికవర్‌లో రోబోటిక్ రికార్డు..

### ఏడాదిలో 100 శస్త్రచికిత్సలు పూర్తి చేసిన డా. శరత్ చంద్ర కౌశిక్!

**హైదరాబాద్,ఆగస్టు08(మనం న్యూస):** హైదరాబాద్ వైద్య రంగంలో మరో అద్భుత ఘనత నమోదైంది. హైటెక్ సిటీ మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ శరత్ చంద్ర కౌశిక్ కేవలం ఒక్క ఏడాది కాలంలోనే 100 రోబోటిక్-అసిస్టెడ్ జనరల్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసి సరికొత్త మైలురాయిని అధిగమించారు. అత్యాధునిక మినిమల్లి ఇన్వేసివ్ శస్త్రచికిత్సల్లో ఆయనకున్న అసాధారణ నైపుణ్యానికి, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మేలైన సాంకేతికతకు ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది. ఈ వంద సర్జరీల్లో 35 ఇంగ్వైనల్ హెర్నియా రిపేర్లు, 25 గాల్‌బ్లాడర్ చికిత్సలు, 20 సంక్లిష్ట అబ్డామినల్ వాల్ రీకన్‌స్ట్రక్షన్లు, 10 బేరియాట్రిక్ సర్జరీలు, మరో 10 గ్యాస్ట్రోఇంటెస్టినల్ ప్రక్రియలు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా కేసులు అత్యంత సంక్లిష్టమైనవి కావడం గమనార్హం. ఈ క్లిష్టమైన



ప్రక్రియల్లో రోబోటిక్ ప్లాట్‌ఫామ్ అందించే త్రీడీ విజువలైజేషన్, ఖచ్చితమైన పరికర నియంత్రణ శస్త్రచికిత్సల నాణ్యతను మరింత పెంచాయని డాక్టర్ కౌశిక్ తెలిపారు. మొత్తం వంద కేసుల్లో 96 సర్జరీలు పూర్తిగా రోబోటిక్ విధానంలోనే విజయవంతం కాగా, కేవలం రోగి భద్రతను మాత్రమే దృష్టిలో ఉంచుకుని వైద్యపరమైన నిర్ణయంతో మూడు కేసులను లాపరోస్కోపిక్‌కు, ఒక కేసును ఓపెన్ సర్జరీకి మార్చాల్సి వచ్చిందని వివరించారు. రోబోటిక్ టెక్నాలజీ వల్ల శరీరానికి గాయం తగ్గడంతో పాటు, శస్త్రచికిత్స అనంతరం నొప్పి చాలా తక్కువగా ఉంటుందని, దీనివల్ల రోగులు ఆసుపత్రి నుంచి త్వరగా డిశ్చార్జ్ అయి తమ పనుల్లో బిజీ అయిపోవచ్చని పేర్కొన్నారు. అయితే సాంకేతికత ఎంత అద్భుతంగా ఉన్నా, చికిత్స విజయవంతం కావడంలో వైద్యుడి క్లినికల్ నిర్ణయాలే ఎప్పుడూ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు.తన వృత్తి జీవితంలో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం వెనుక రోగులు తనపై ఉంచిన నమ్మకంతో పాటు, అనస్థీషియాలజిస్టులు, రోబోటిక్ ఓటీ నిపుణులు, నర్సింగ్ సిబ్బంది అందించిన సమిష్టి సహకారమే కారణమని డాక్టర్ శరత్ చంద్ర కౌశిక్ కృతజ్ఞతలు తెలిపారు. సరైన రోగి ఎంపిక, అత్యుత్తమ వైద్య ఫలితాలే లక్ష్యంగా హైటెక్ సిటీ మెడికవర్ హాస్పిటల్స్ రాబోయే రోజుల్లో మినిమల్లి ఇన్వేసివ్, రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు కట్టుబడి ఉందని ఆసుపత్రి యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది.

## అసంపూర్తి...

ప్రేమే ఎందుకని నన్ను
పదే పదే అడుగకు ప్రియా...
ఊపిరికి ప్రత్యామ్నాయం
చూపించి అప్పుడడగు నన్ను
క్షతగాత్రుని
మనసులాంటిదిప్పుడు
నా హృదయం
గాయం మానేదాక
పుండు మీదనే ధ్యాసున్నట్టు
నా పానమంతా నీ మీదనే
కొట్టుకుంటున్నది
నాకు నీపై ప్రేమేంత అని కూడా
మాటిమాటికి ఛలికించకు సఖి
ఆకాశపు కొలతేంతో చెప్పి
అప్పుడడుగు నన్ను
నీవిప్పుడు నాకు నేనే చేసుకున్న
గుండెమీది పుండువి
పుండు మానుతుందేమో
కానీ బర్ర మానదన్నట్టు
నీవుండకపోవచ్చు కానీ
నీ జ్ఞాపకం
ఎప్పటికీ మలగనిది
అసంపూర్ణమైనదేదైనా
భూమి మీదున్నదంటే
కోరిక, సుఖం, ప్రేమ మాత్రమే.

**- దిలీప్.వి**
8464030808

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# పుస్తకం గుప్పిట ప్రపంచం



పుస్తకం అనేది కేవలం కాగితపు పుటల సమాహారమే గాక, అది మానవ చైతన్యానికి, మేధస్సుకు, సంస్కృతికి ప్రతిబింబం. ఇది భావనలకు పరిమితం కాకుండా, విస్తృతంగా విరాజిల్లే మానసిక పరిపక్వతకు మార్గదర్శి. జ్ఞానాన్ని అక్షరాల్లో బంధించిన మహాత్మ్యం పుస్తకానికి మాత్రమే చెల్లుతుంది. చదివే ప్రతి పుట ఒక కొత్త లోకాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ భావోద్వేగ, విజ్ఞాన మార్గదర్శి పుస్తకాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం జరుపు కుంటారు. పుస్తకాన్ని ప్రేమించడమంటే జీవితం పట్ల ప్రేమను పొందడమే. పఠనాన్ని అలవాటు చేసుకోవడం అంటే మనుషుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే ఆత్మ కాంక్ష.

ఈ దినోత్సవాన్ని ఎవరు ప్రారంభించారన్న దానిపై స్పష్టత లేకున్నా, ఈ రోజు ఉద్దేశం మాత్రం అపారంగా ఉంది. పఠన సంస్కృతిని నిలబెట్టడం, ముద్రిత పుస్తకాల విలువను గుర్తు చేయడం, చదవడం అనే నిర్జీవంగా మారుతున్న మానవ గుణాన్ని మళ్లీ జీవింప జేయడం ఈ దినోత్సవ ప్రయోజనంగా భావించాలి. డిజిటల్ యుగంలో చదువులు తెరవెనుక సెల్‌ఫోన్ తెరలకే పరిమితమై పోతున్న తరుణంలో, ముద్రిత పుస్తకాలను మళ్లీ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నంగా ఈ దినోత్సవాన్ని చూసుకోవాలి. చదవడం అనేది వ్యక్తిగత సాధన అయినప్పటికీ, సమాజ నిర్మాణంలో దీని పాత్ర అమూల్యం. చదివిన ప్రతి వ్యక్తి ఆలోచించ గలడు. ఆలోచన చేసిన ప్రతి ఒక్కరూ మార్పును ఆవిష్కరించ గలరు. మార్పే మానవ అభివృద్ధికి పునాది.

చదవడం అనేది చింతనకు మూలం. అది ఊహకు ఊత మందించే వ్యవస్థ. ఒక్క పుస్తకం మనిషి జీవితాన్ని దిద్దుబాటు చేయగలదు. చదవడం ద్వారా వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించు కుంటాడు. శ్రద్ధ, ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ, భాషా పటిమ, వివేచన, నిశ్చలత- ఇవన్నీ చదివే అలవాటుతోనే వస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి నుంచే చదివే అలవాటు పెంచితే, పిల్లలలో మేధో వికాసం, భావ ప్రకటన సామర్థ్యం, అపూర్వ ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతాయి. చదివే పుస్తకం ఓ లోక దర్శనం, చదివిన పుటలు అనుభవాల చరిత్ర.

భారతదేశం ప్రపంచానికి శబ్ద బ్రహ్మగా మారిన దేశం. ఇది శ్రుతి సంప్రదాయానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, గృహసూత్రాలు, స్మృతులు మొదలెన అనేక పాఠ్య సంపదలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తాళ పత్రాలపై రాయడం మొదలై, అక్షరాల రూపంలో జ్ఞానం ముద్రించ బడింది. మనకున్న ప్రాచీన పుస్తక సంపద ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసే స్థాయిలో ఉంది. వేదాలలో విజ్ఞానం, వ్యాకరణ, ఛందస్సు, సాహిత్యగ్రంథాలు, చాణక్య అర్థ శాస్త్రం,శాస్త్రీయ దర్శనాలలో ఉపనిషత్తుల లోతు, మహాభారత రామాయణాల అఖండత, పురాణాల పురాతనత - ఇవన్నీ పుస్తక రూపాల్లో మానవ చైతన్యానికి అక్షర ప్రతిరూపాలు.

తెలుగు సాహిత్యంలో కూడా అనేక అపురూప గ్రంథ సంపద ఉంది. నన్నయ్య భావార్థంగా ముద్రించిన మహాభారతం, తిక్కన్న సాహిత్యం, పోతన భాగవతం, వేమన పద్యాలు, వివిధ శతకాలు, తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగయ్య కీర్తనలు- ఇవన్నీ కేవలం భక్తి భావనకే కాదు, భాషా శిల్పానికి, పాఠ్య పరం పరలకు చక్కటి ఉదాహరణలు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విశ్వనాథ, మల్లాది, శ్రీశ్రీ, కందుకూరి, గురజాడ, ఆరుద్ర, వట్టికోట, యండమూరి, జంధ్యాల, రచయిత్రులు - అనేక రచయితలు తమ రచనలతో పాఠకులను తాకిన తీరు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంకల్ప భరితమైన రచనలు పఠనానికి ప్రేరణ గా నిలిచాయి. పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు లెక్క లేనివి. పుస్తకం మనకు నూతన భావనలు అందిస్తుంది, ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది, భాషలో మాధుర్యాన్ని పెంచుతుంది, లోతైన ఆలోచనకు అవకాశాన్ని ఇస్తుంది. ముఖ్యంగా ఉహా శక్తిని ప్రేరేపించి, మనలోని సృజనాత్మకతను మేల్కొలిపే సాధన పుస్తకం. చదవడం అనేది మానసిక దృష్టి కోణాన్ని శుద్ధి చేస్తుంది. అది మనల్ని మెదడుతో, మనస్సుతో, కలుపుతుంది. ఇది యాంత్రికతను అధిగమించి ఆలోచనను పురిగొలిపే ప్రక్రియ.

ఈ దినోత్సవాన్ని వ్యక్తిగతంగా జరుపుకోవడం కన్నా సామూహికంగా జరుపుకుంటే అధిక ప్రయోజనం. పాఠశాలలలో పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు, గ్రంథాలయాల సందర్శనలు, పుస్తకాల చర్చలు, రచయితల ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు సమాజాన్ని పఠన పట్ల ఆకర్షించ గలవు. ఇంట్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా వారికి చదవడం పట్ల ఆసక్తి కలిగించ వచ్చు. పాత పుస్తకాలను పాఠశాలలకు, స్వచ్ఛంద సంస్థలకు దానం చేయడం వల్ల పఠన వనరులు పెరుగుతాయి. ఈ దినోత్సవం రోజున ఒక్క మంచి పుస్తకాన్ని పరిచయం చేయడం కూడా సమాజ మార్పుకు పునాది వేయగలదు. చదవడమంటే కేవలం గడిపిన సమయం కాదు, అది మనిషిగా మనలో పెరిగిన క్షణం. ఒక పుస్తకం మన జీవితాన్ని మార్చ గలదు. మనం మారితే సమాజం మారుతుంది. అందుకే పుస్తకాన్ని ప్రేమించాలి, పఠనాన్ని అభివృద్ధి పరచాలి, పుస్తక ప్రేమికుల దినోత్సవాన్ని జ్ఞానోత్సవంగా మార్చాలి. మానవ వికాసానికి పుస్తకం కీర్తి పతాక. జీవితాన్ని నిర్మించుకునే మార్గంలో పఠనం మనకు తోడుగా ఉండే కాంతి రేఖ. జ్ఞానం మాత్రమే నిజమైన శక్తి. ఆ శక్తిని మన చేతుల్లోకి తేవాలంటే పుస్తకాన్ని ఒడిసిపట్టాలి. చదవడమే మార్గం, పుస్తకమే సాధనం.

**ఆగస్టు 9...జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# స్వేచ్ఛ కోసం.. క్విట్ ఇండియా



చరిత్రలో కొన్ని ఉద్యమాలు ప్రభుత్వాలను సవాలు చేయడమే కాదు, ఒక జాతిని జాగృతం చేస్తాయి. 1942 ఆగస్టు 9న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం అలాంటిదే. ఇది ఒక్క రోజులో పుట్టిన ఆవేశం కాదు, తొంభై ఏళ్ల జాతీయ చైతన్యం, త్యాగాల పరంపర పరిణామం. 1857 సిపాయిల తిరుగుబాటుతో మొదలైన స్వేచ్ఛా జ్వాల, 1885 కాంగ్రెస్ స్థాపనతో ఒక దశ,దిశ పొంది, తిలక్, లజపత్ రాయ్, బిపిన్ చంద్ర పాల్ వంటి నాయకుల నినాదాలతో ఉవ్వెత్తున ఎగసింది. గాంధీజీ నేతృత్వంలోని అసహకార, శాసనోల్లంఘన ఉద్యమాలు స్వాతంత్ర్య కాంక్షను గ్రామగ్రామానికీ చేర్చాయి.

1939లో రెండో ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు, భారత ప్రజలను సంప్రదించకుండానే బ్రిటిష్ ప్రభుత్వం దేశాన్ని యుద్ధంలోకి లాగింది. వేలాది సైనికులు ప్రాణాలు కోల్పోయారు, వనరులు దోచుకోబడ్డాయి కానీ స్వాతంత్ర్యంపై ఒక్క హామీ కూడా లభించలేదు. 1942లో వచ్చిన క్రిప్స్ మిషన్ కూడా నిజమైన అధికార బదిలీని ప్రతిపాదించకపోవడంతో, బ్రిటిష్ పాలన స్వచ్ఛందంగా స్వాతంత్ర్యం ఇవ్వదన్న సత్యం భారతీయులకు మరింత స్పష్టమైంది.ఈ నేపథ్యంలో గాంధీజీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలోని గోవాలియా ట్యాంక్ మైదానంలో క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించబడింది. అదే వేదికపై గాంధీజీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు యువతరాన్ని ఉర్రూతలూగించింది. ఇది హింసకు పిలుపు కాదు, అహింసా మార్గంలో ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలన్న నైతిక ఆదేశం. మరుసటి రోజే గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్ వంటి ప్రధాన నాయకులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. నాయకత్వాన్ని బంధిస్తే ఉద్యమం ఆగిపోతుందని వారు భావించారు. కానీ చరిత్ర దీనికి విరుద్ధంగా మలుపు తిరిగింది. నాయకులు జైలులో ఉన్నా, సామాన్య ప్రజలే ఉద్యమ నాయకత్వాన్ని చేపట్టారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు అందరూ ఒక్కటై ఉద్యమంలో దూకారు. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాన్ని ఉధృతం చేశారు.

ఈ ఉద్యమానికి కేంద్రీకృత నాయకత్వం లేకపోవడమే దాని అసలైన శక్తిగా మారింది. బ్రిటిష్ ప్రభుత్వం నాయకులను నిర్బంధించగలిగింది, కానీ ఒక జాతి స్వేచ్ఛా సంకల్పాన్ని బంధించలేక పోయింది. జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా వంటి యువ సోషలిస్టు నాయకులు రహస్య నెట్‌వర్క్‌ల ద్వారా ఉద్యమాన్ని నడిపారు. ఉషా మెహతా నిర్వహించిన రహస్య 'కాంగ్రెస్ రేడియో' సెన్సార్‌ను ఛేదించి దేశ వ్యాప్తంగా స్వేచ్ఛా సందేశాలు ప్రసారం చేసింది. అరుణా ఆసఫ్ అలీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి చరిత్రలో నిలిచిపోగా, పశ్చిమబెంగాల్లో మాతంగిని హాజ్రా జాతీయ జెండాను చేతబూని పోలీసు కాల్పుల్లో ప్రాణత్యాగం చేశారు. స్వేచ్ఛ కోసం భయం లేకుండా నిలబడే తత్వం, మహిళా నాయకత్వ పటిమ, నేటి యువతకు స్ఫూర్తిదాయకమైన పాఠం .

తెలంగాణ అప్పట్లో నిజాం రాజ్యంలో ఉన్నా, ఉద్యమ ప్రభావం ఇక్కడా స్పష్టంగా కనిపించింది. స్వామి రామానంద తీర్థ, డా. మెల్కోటే, కాళోజీ నారాయణరావు, వందేమాతరం రామచంద్ర రావు, బూర్గుల రామకృష్ణారావు వంటి నాయకులు ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, ప్రజా మండళ్లు నిజాం నిర్బంధాల మధ్య కూడా జాతీయోద్యమ జ్వాలను కొనసాగించాయి. ఇది తర్వాతి హైదరాబాద్ విమోచన ఉద్యమానికి పునాదిగా నిలిచింది.

1943-45 మధ్య సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆగ్నేయాసియాలో సాయుధ పోరాటాన్ని కొనసాగించింది. 1945లో బ్రిటన్‌లో క్లెమెంట్ అట్లీ ఆధ్వర్యంలో లేబర్ పార్టీ అధికారంలోకి రావడం, 1946లో రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు బ్రిటిష్ పాలకులను కుదిపేశాయి. చివరకు 1947 ఫిబ్రవరిలో అధికార బదిలీ ప్రకటన వెలువడి, ఆగస్టు 15న భారత్ స్వతంత్ర దేశంగా అవతరించింది. చరిత్రకారులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్వాతంత్ర్యానికి ముందుమాటగా అభివర్ణిస్తారు.

క్విట్ ఇండియా ఉద్యమం మనకు నేర్పిన గొప్ప పాఠం, నాయకత్వం లేకపోయినా, సాధారణ ప్రజలే మార్పుకు అసలైన శక్తి కాగలరు. అప్పటి యువత తమ ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టి దేశం కోసం నిలబడింది. నేటి యువతకు బాధ్యత అలాగే ఉంది. అవినీతిపై పోరాటం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమాజంలో సమానత్వం కోసం నిలబడటం ఇవన్నీ నేటి 'క్విట్ ఇండియా' రూపాలే.

స్వేచ్ఛ అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు, అది ప్రతిరోజూ న్యాయం, సత్యం, సమానత్వం కోసం నిలబడే సంకల్పం. గాంధీజీ 'డూ ఆర్ డై' నినాదం నేటికీ మనకు గుర్తుచేసేది ఒక్కటే. లక్ష్యం సరైనదైతే, భయం అడ్డురా కూడదు. చరిత్రను మార్చేది ఆయుధాలు కాదు, సంకల్పంతో నిలిచే ప్రజలు. ఈ ఆగస్టు 9న, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రతి యువకుడు తన వంతుగా దేశనిర్మాణంలో బాధ్యతాయుతంగా నిలబడాలి. అదే అమరవీరుల త్యాగానికి నిజమైన నివాళి.

**- గిలకత్తుల వెంకటరమణ గౌడ్**
9866878769



# ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప



ఆచార్య మసన చెన్నప్ప సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని సమగ్రంగా ప్రతిబింబించే జక్కని వెంకట రాజం రచించిన చెన్నపార్యశతకం ఆవిష్కరణ 2026 ఆగస్టు 9న జరగడం తెలుగు సాహిత్య వర్గాలకు విశిష్టమైన సందర్భంగా నిలుస్తోంది. ఆచార్య చెన్నప్ప చేసిన బహుముఖ సేవలను శతక రూపంలో సాహితీకరించడం ఈ గ్రంథ ప్రత్యేకత. అక్షరసేవను సమాజసేవతో, సంస్క ృతిని ఆధ్యాత్మిక చైతన్యంతో అనుసంధానించిన ఆయన జీవన ప్రయాణానికి ఈ చెన్నపార్యశతకం ఒక సాహిత్య గౌరవ నివేదనగా చిరస్థాయిగా నిలిచే కృతిగా భావించవచ్చు.




ఒక అధ్యాపకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, పరిశోధకుడిగా విస్తరించి, సాహితీవేత్తగా పరిపక్వమై, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్ష స్థాయికి ఎదిగింది. తెలుగు భాషా సంస్క ృతుల పట్ల ఉన్న నిబద్ధత, పరిశోధన పట్ల ఉన్న క్రమశిక్షణ, సమాజంతో మమేకమైన సాహిత్య దృష్టి కలిసిన ఒక సజీవ సాహిత్య ప్రస్థానం.

1955 ఫిబ్రవరి 8న మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం రంగారెడ్డి ప్రాంతంతో అనుబంధంగా గుర్తించబడే ప్రాంతీయ నేపథ్యం)లోని కొల్లూర్ ఎల్లి గ్రామంలో జన్మించిన ఆచార్య చెన్నప్ప సాధారణ కుటుంబంలో జన్మించారు. సుమారు నాలుగు దశాబ్దాలకుపైగా సాగిన ఆయన బోధనా సేవ విశేషమైనది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుండి ప్రభుత్వ డిగ్రీ కళా శాలల వరకు, అక్కడి నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు విస్తరించిన ఈ ప్రయాణంలో వేలాది మంది విద్యార్థులు ఆయన బోధన ద్వారా ప్రభావితులయ్యారు. తెలుగు బోధనను కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో ఉంచకుండా ప్రజాను భవాలతో అనుసంధానించడం ఆయన ప్రత్యేకత. చదవాలనే ఆసక్తిని, ప్రశ్నించాలనే ధైర్యాన్ని, పరిశోధన చేయాలనే తపనను పెంపొందించిన గురువుగా ఆయనకు ఉన్న పేరు విశిష్టమైనది. మసన చెన్నప్ప సాహిత్య సృజన వైవిధ్య భరితమైనది. పద్యకవిత్వం, వచనకవిత్వం, సాహిత్య వ్యాసాలు, విమర్శ, పరిశోధన, అనువాద ధోరణులు- ఇలా అనేక ప్రక్రియల్లో ఆయన తన ముద్రవేశారు. నేత్రోదయం, సమాలోచనం, ప్రత్యూష, ఆ సంధ్య, వేలు-మేలాలు,ఉపన్యాసాలు- వ్యాసాలు,తెలంగాణ తెలుగులు వంటి రచనలు ఆయన సాహిత్య దృష్టి విస్తృతిని తెలియ జేస్తాయి. ఈ రచనల్లో సమాజాన్ని పరిశీలించే విశ్లేషణాత్మక దృష్టి, భాషా సంస్కృతులపట్ల ఉన్న ప్రేమ, ప్రాంతీయ అనుభవాలను సాహిత్యంగా మలిచే సామర్థ్యం కనిపిస్తాయి. తెలంగాణ భాషా వైవిధ్యంపై ఆయన చేసిన కృషి ప్రస్తావనీయమైనది. తెలంగాణ తెలుగును తక్కువచేసే ధోరణులు ఉన్న కాలంలో, దాని సాంస్కృతిక గౌరవాన్ని, భాషా వైశిష్ట్యాన్ని, ప్రజల జీవనానుభవాలను సాహిత్య చర్చలోకి తీసుకు రావడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది. తెలం గాణ మాండలికాలు, ప్రజాపదాలు, స్థానిక భావ వ్యక్తీకరణలు కూడా సాహిత్యానికి సముచితమైనవేనని ఆయన రచనలు బలంగా ప్రతిపాదించాయి. పరిశోధకుడిగా ఆయన సేవలు మరింత విశాలమైనవి. అనేక మంది ఎం.ఫిల్, పీహెచ్.డి. పరిశోధకులకు మార్గనిర్దేశనం చేయడం ద్వారా ఆయన తనదైన ఒక పాఠశాలగా నిర్మించారు. పరిశోధన అంటే మూలగ్రంథాల అధ్యయనం, సందర్భ అవగాహన, స్వతంత్ర ఆలోచన, శాస్త్రీయ నిష్పాక్షికత అవసరమని ఆయన తన శిష్యులకు నేర్పారు. చెన్నప్ప కృషికి అనేక పురస్కారాలు, సత్కారాలు లభించాయి. గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ నుండి తెలంగాణ ప్రతిభా పురస్కారం వరకు, సాహిత్య సంస్థల నుండి విద్యాసంస్థల వరకు ఆయనకు లభించిన గౌరవాలు వ్యక్తిగత ప్రతిష్ఠకు మాత్రమే కాక, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవకు దక్కిన గౌరవంగా భావించాలి. ఆయన వ్యక్తిత్వంలో అత్యంత ముఖ్యమైన అంశం వినయం. విశ్వవిద్యాలయ స్థాయి గౌరవాలు, పరిశోధనా ప్రఖ్యాతి, సాహిత్య ఖ్యాతి ఉన్నప్పటికీ ప్రజలతో మమేకమయ్యే సరళతను ఆయన కోల్పోలేదు. గ్రామజీవితం, సామాన్యుల అనుభవాలు, విద్యార్థుల సమస్యలు, భాషా గౌరవం-ఈ అంశాలు ఆయన ఆలోచనలో ఎప్పుడూ కేంద్రస్థానంలో నిలిచాయి. సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రదానం చేసిన సత్కార పత్రంలో ఆచార్య మసన చెన్నప్పను తెలుగు సాహిత్యానికి, ఉపన్యాస సంప్రదాయానికి, పరిశోధనకు విశిష్ట సేవలందించిన ప్రముఖ సాహితీవేత్తగా అభివర్ణించారు.

ఆర్షకవిగా ఉపనిషత్ పరిశోధకుడిగా ప్రసిద్ధి పొందిన మసన చెన్నప్ప ఆరువేల ముత్యాల సరాల్లో ఉపనిషత్ జ్ఞానాన్ని అందించారు.

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

## చిన్న కవితలు

చెట్టును
కదిపితేనే తెలిసింది
ఇక్కడ వానపడిందని

కొంతవానను
దాచిపెట్టుకుంటుంది చెట్టు
తన కిందికెళ్లినవారికోసం

మట్టిలో కలవమంటే
కలవమని చెట్టుకు వేలాడు
తున్నాయి
ఎంత పిచ్చివో వాన
చినుకులు

అప్పుడప్పుడూ వానే
రోడ్డుపక్క దుమ్ము
కొట్టుకుపోయిన
చెట్లూ, మనుషుల కోసం

అక్షరాలు దిద్దమంటే
సున్నాలు చుడుతోంది
చెరువు పలకపై వాన

గుండెను
కాస్త పెద్దది చేసుకుని
ఇద్దరికి చోటిచ్చింది
గొడుగు

గొడుగులో ఇచ్చింది
గుండెలో చోటిచ్చినంత
ఫీలింగు

వీధి వీధంతా
నల్లమొగ్గలు వికసించాయి
వాన పెద్దదైంది

పెద్దలు
పిల్లలయ్యారు
వానలో తడుస్తూ

గొడుగు కిందికి చేరాలా
వద్దానే ఆమె సంశయాన్ని
ఉరుము తీర్చింది

**- చిత్తలూరి**
9133832246

# సకల పాప హారిణి...కామిక ఏకాదశి

పరమ పవిత్రమైనది, పుణ్య ప్రధానమైనది ఆషాఢ మాసంలో కృష్ణ పక్ష ఏకాదశి. దీనిని 'కామిక ఏకాదశి'గా జరుపుకుంటారు. ఈ ఏకాదశికి పేరుకు తగినట్లే మనసులోని కోరికలను సిద్ధింపచేసే శక్తి ఉందని భావిస్తారు. కామిక ఏకాదశి రోజున శ్రీహరిని ఆరాధిస్తే వచ్చే పుణ్యఫలం కాశీలో గంగ స్నానం కన్నా, హిమాలయాలలో ఉండే కేదారనాథుని దర్శనం కన్నా, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో ఆచరించే స్నానం కన్నా, సమస్త భూమండలాన్ని దానం చేసిన దానికన్నా, గురు గ్రహం సింహ రాశిలో ఉన్న పౌర్ణమి రోజు సోమ వారం, గోదావరి నదిలో పుణ్య స్నానం చేస్తే వచ్చే పుణ్యఫలం కన్నా ఎక్కువ. శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లిన నాలుగు నెలల కాలంలో వచ్చే తొలి ఏకాదశి కావటంతో దీనిని విశేషంగా పరిగణిస్తారు.

ధర్మవర్తనుడైన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణున్ని ' ఆషాఢ మాసములో కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశి మహిమలను గురించి వివరించమని' కోరగా, దానికి ఆ వాసుదేవుడు, ఏకాదశి యొక్క మహిమలను వివరించటం జరిగింది. నారద మునీంద్రుడు తన తండ్రి బ్రహ్మ దేవుడిని 'ఆషాఢ కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశిని గురించి వివరించమని కోరగా దానికి బ్రహ్మ బదులిస్తూ ఆషాఢ కృష్ణ పక్షములో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అంటారని ఈ ఏకాదశి మహిమ విన్నంతనే అశ్వమేధ యాగఫలం లభిస్తుందని, శంఖ, చక్రగదాధరుడు, తామర పాదములు కలిగి ఉన్నవాడు శ్రీధరుడు, హరి, విష్ణు, మాధవుడు, మధు సూధనుడు అనే పేర్లతో పిలవబడేవాడు అని.. శ్రీ మహావిష్ణువును కామిక ఏకాదశి రోజు ఆరాధిస్తారని వివరించి నట్లు పురాణ కథనం. కామిక ఏకాదశి రోజు పాలు ఇచ్చే గోవును, దూడ మరియు గ్రాసములతో కలిపి దానం చేయటం వలన సమస్త దేవతల ఆశీర్వాదం పొందుతారని, గతములో చేసిన పాపములకు భయపడేవారు, పాపమయమైన జీవితంలో కూరుకపోయినవారు ఏకాదశి వ్రతమాచరించి మోక్షమును పొందవచ్చునని బ్రహ్మ వివరించి నాట్లు పేర్కొన బడింది.

కామిక ఏకాదశి రోజు ఉపవసించిన వారు, సమస్త ఆధ్యాత్మిక సాహిత్యాలను అధ్యయనం చేసిన వారి కన్నా గొప్పవారని,' ఈ రోజు రాత్రి ఆధ్యాత్మికంగా జాగరణం చేసిన వారు ఎప్పుడూ యమధర్మరాజు కోపానికి గురికారని, ఈ వ్రతం ఆచరించిన వారు భవిష్యత్తులో మళ్ళీ జన్మనెత్తే అవసరం ఉండక మోక్షమును పొందుతారని స్వయంగా మహా విష్ణువే చెప్పినట్లు బ్రహ్మ వివరణ. కనుక ఈ ఏకాదశిని ప్రత్యేక శ్రద్ధతో ఆచరించాలి. కామిక ఏకాదశి రోజున తులసి ఆకులతో విష్ణువును ఆరాధించేవారు, అన్ని పాపముల నుండి విముక్తి పొందుతారు. తామరాకును నీటి బొట్టు అంటనట్లే వారిని కూడా పాపము అంటదు.

ఒక్క తులసి ఆకుతో ఆరాధించటం వలన వచ్చే పుణ్యము, బంగారం, వెండి దానం చేస్తే వచ్చే దాని కన్నా ఎక్కువ. తులసి ఆకుతో ఆరాధిస్తే శ్రీహరి, ముత్యాలు, కెంపులు, పుష్పరాగములు , వజ్రాలు, నీలం మరియు గోమధికములతో పూజించిన దానికన్నా ఎక్కువ సంతోషిస్తాడు. లేత తులసి ఆకులతో చేసే ఆరాధన గత జన్మ పాపాలను కూడా తొలగించి వేస్తుంది. కామిక ఏకాదశి రోజున తులసి మొక్కను ఆరాధిస్తే కూడా పాపములు తొలగి పోతాయి. తులసిని నేతి దీపంతో ఆరాధించే వాళ్ల పాపములను చిత్రగుప్తుడు లెక్కలోకి తీసుకోడు. ఈ రోజున శ్రీకృష్ణుని నువ్వుల మరియు నేతి దీపములతో ఆరాధిస్తారో, వారు శాశ్వతముగా సూర్యలోకములో నివసించే అర్హత కలిగి ఉంటారు. కామిక ఏకాదశికి బ్రహ్మ హత్యా పాతకాన్ని, భ్రూణ హత్యా పాపమును కూడా తొలగించే శక్తి ఉంది అని బ్రహ్మ నారదునికి వివరించినట్లు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో చెప్పినట్లుగా పురాణ ఆధారం. కామిక ఏకాదశి రోజున తులసీ దళాలతో విష్ణుమూర్తిని పూజించడం ద్వారా సకల సంతోషాలు చేకూరుతాయి. తులసీ దళాలతో పూజ చేయడం ద్వారా అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయి. శత్రుబాధ, ఈతిబాధలు, ఆర్థిక ఇబ్బందులు తొలగి పోతాయి. ఒక తులసీ దళం.. నవరత్నాలు, వజ్ర వైఢూర్యాలు, స్వర్ణం, వెండి కంటే అతీతమైందని పురాణాలు చెబుతున్నాయి. కామిక ఏకాదశిన సూర్యోదయానికి ముందే లేచి శుచిగా స్నానమాచరించి విష్ణుపూజ, తులసీ పూజ చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పౌరాణికులు చెబుతున్నారు. ఆ రోజున శ్రీ కృష్ణుడిని నిష్ఠగా పూజించి నువ్వుల నూనె లేదా నెయ్యితో



దీపమెలిగిస్తే.. ఆ పరమాత్మ ఆశించిన ఫలితాలనిస్తాడని, పాపాలను హరింపజేసి, స్వర్గలోకవాస ప్రాప్తం ప్రసాదిస్తాడని పండితులు చెపుతున్నారు.

**- ఆర్‌కేఎస్**



# భూ సేకరణ, పునరావాసాలకు నిధుల కొరత రానివ్వం

## రూ.5 వేల కోట విడుదలకు లైన్ క్లియర్

## అనుమతుల పేరుతో పనులు ఆలస్యం కానివొద్దంటూ కలెక్టర్లకు ఆదేశం

## మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు పున: ప్రారంభించాలె

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 8 (మనం బ్యూరో) :** రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పునరావాసం-పునర్నిర్మాణం కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల అయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియలో ఉందని తెలిపారు. శనివారం కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో భూ సేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ పరిపాలనా అంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్యత అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు.

ఇంజినీరింగ్ పనులు ఒకవైపు కొనసాగుతుండగానే సాధ్యమైన ప్రాంతాల్లో భూ సేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలి స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.వేల కోట్లు వెచ్చించిన ప్రాజెక్టులకు వీలైనంత త్వరగా పూర్తి చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా నిలిచి పోయిన మిడ్ మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, సవరించిన అంచనాలను సిద్ధం చేయడం, భూ సేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ద అనుమతుల సాధన ఇవన్నీ ఒకదాని తరువాత ఒకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రక్రియల పేరుతో పనులు నిలిచిపోకుండా నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అధికారులకు సూచించారు.

# ఎల్లారెడ్డిపేటలో మృతుడి కుటుంబానికి 5 లక్షల ప్రమాద బీమా అందజేత

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆసరాగా కేటీఆర్, చల్మెడ బీమా పథకం




**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 8(మనం ప్రతినిధి ):-** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు దివంగత బొమ్మనివేణి రాజు కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆటో యూనియన్ నాయకులు అందజేశారు. నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు మృతి చెందాడు. మాజీ మంత్రి కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావు సౌజన్యంతో జిల్లాలోని 5 వేల మంది ఆటో కార్మికులకు ఉచితంగా చేయించిన ఆరోగ్య, ప్రమాద బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. మృతుడి భార్య బొమ్మనివేణి భాగ్యలక్ష్మికి జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లే శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో బీమా సొమ్మును అందజేశారు.

ఈ సందర్భంగా కష్టకాలంలో ఆటో కార్మికుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు బీమా సౌకర్యం కల్పించిన కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావులకు ఆటో కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్య క్రమంలో వేములవాడ ఆటో కార్మికులు ఎం.ఎ. అంజాద్ పాషా, మేడిపల్లి రాజు, ఎండి ఖాజా, షేక్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్గొండలో రూ. 10 లక్షల సి.సి. రోడ్డు పనుల శంకుస్థాపన



**జగిత్యాల, ఆగస్టు 8( మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామంలో రూ. 10 లక్షలతో సి.సి. రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో వచ్చిన నిధులతో చేపట్టిన ఈ పనులకు వెల్గొండ సర్పంచ్ నీలం నందిని సంతోష్,బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ వర్క్ షాప్

- విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



**ధర్మపురి, ఆగస్టు 08( మనం న్యూస్ ):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడం, విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఉన్న త విద్యా మండలి చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచర ణ ప్రణాళికలో భాగంగాధర్మపురి లోని మహాత్మా జ్యోతిబాపూలే పురుషుల గురుకుల డిగ్రీ కళాశా లలో రెండు రోజుల వర్క్షాప్ విజయవంతంగా పూర్తయింది. శాతవాహన విశ్వవిద్యాలయం సౌజన్యంతో డేటా మేనేజ్మెంట్ అనాలిసిస్ కోసం మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ అనే అంశంపై కార్యక్ర మాన్ని నిర్వహించారు. కమలా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. సంజీవ్ రాజు నిపుణుడిగా వ్యవహరించారు. ప్రొజెక్టర్ సహా యంతో డేటా ఎంట్రీ,డేటా ఆర్గనైజేషన్,మేనేజ్మెంట్ సమాచారా న్ని సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై ప్రాక్టికల్ ఉదాహ రణలతో విద్యార్థులకు అవగా హన కల్పించారు.శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నా లజీ సమాచార సాంకేతిక విభా గం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.రవి కుమార్ విచ్చేసి,మైక్రోసాఫ్ట్ ఎక్సె ల్లోని ప్రధాన విధులైన వీలూ కప్, హెచ్లూకప్,లాజికల్ ఫంక్ష న్స్ తో పాటు,అడ్వాన్స్డ్ ఎక్సెల్ లో కృత్రిమ మేధను ఎలా ఉప యోగించాలో వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహా లను నివృత్తి చేశారు.ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎల గందుల రాధాకిషన్ మాట్లాడు తూ ఆర్ట్స్,కామర్స్,సైన్స్ పరి శోధన వంటి వివిధ రంగాల్లో విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ఎంతో ఉపయోగకరమైన సాధ నమని తెలిపారు.ప్రాక్టికల్ సెష న్లను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. ఈ వర్క్షాప్ నిర్వహణకు సహ కరించిన శాతవాహన విశ్వవి ద్యాలయానికి ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూట ర్ సైన్స్ విభాగాధిపతి, ప్రోగ్రామ్ కన్వీనర్ ఎ.వనిత మాట్లాడు తూ నిత్య జీవితంలోనూ,విద్య మరియు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలలో ఎక్సెల్ పాత్రను వివరించారు. స్వయంగా సాధన చేయడం ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలు పునిచ్చారు. అనంతరం అతిథులకు,నిపుణుల కు కళాశాల తరఫున సన్మానం చేశారు.అనంతరం విద్యార్థుల కు ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ రేండ్ల ప్రశాంత్,అధ్యా పకులు, సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్‌ఫోర్స్ కళాశాలలో జాయిజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు



**జగిత్యాల, ఆగష్టు 08 ( మనం ప్రతినిధి):** జగిత్యాల ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలలో జాయిజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు, సాంస్క ృతిక ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముందుగా అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు సాంస్క ృతిక, క్రీడా మరియు సృజనాత్మక కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ కేటగిరీలలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేకంగా అభినందించి, బహుమతులు అందజేశారు.

కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఈ కార్యక్రమం మంచి ఆత్మీయ పరిచయ వేదికగా నిలిచింది. విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలను పండించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల, ఆగస్టు 08 ( మనం ప్రతినిధి):** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎలినినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందన్నారు.

### తాగునీటికే ప్రాధాన్యత... వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ)లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడలేమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం, వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారించాలని సూచించారు.

### ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించండి

వ్యవసాయ శాఖ సూచించిన కందులు, పెసర, మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు, తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# దోమలపై దండయాత్ర!

## 'స్పెషల్ మాన్సూన్ డ్రైవ్'.. ప్రారంభించిన మంత్రి పొన్నం

## పది రోజుల పాటు నగరవ్యాప్తంగా ఐఈసీ అవగాహన సదస్సులు

## ప్రతి శుక్రవారం కచ్చితంగా 'ఫ్రైడే-డ్రైడే' పాటించాల్సిందే

## ప్రజల భాగస్వామ్యంతోనే 'ఆరోగ్య హైదరాబాద్' సాధ్యం




**హైదరాబాద్,ఆగస్టు 8 (మనం న్యూస్):** హైదరాబాద్ నగరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు, దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సరికొత్త యుద్ధాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా నేటి నుంచి పది రోజుల పాటు నగరవ్యాప్తంగా సాగే 'స్పెషల్ మాన్సూన్ డ్రైవ్' పోస్టర్లను, ఐఈసీ అవగాహన ప్రచారాన్ని శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు వాడే అధునాతన పరికరాలు, ఫాగింగ్ యంత్రాల పనితీరును క్షేత్రస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, నగరాన్ని దోమల రహితంగా మార్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రతి శుక్రవారం కచ్చితంగా 'ఫ్రైడే-డ్రైడే' పాటించాల్సిందేనని, ఇళ్లలోను, పరిసరాల్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారానే దోమల లార్వాలను ప్రాథమిక దశలోనే తుడిచిపెట్టగలమని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేయడంతో పాటు, ఇంటింటికీ వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించడం, ముమ్మరంగా ఫాగింగ్ చేయడం, పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి విస్తృత చర్యలను జీహెచ్ఎంసీ వేగవంతం చేసింది. వ్యాధి వచ్చిన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరిగి చికిత్స తీసుకోవడం కంటే, రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని, ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా నగర ప్రజలు స్వీయ బాధ్యతతో తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే 'ఆరోగ్య హైదరాబాద్' కల సాకారమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ఈ డ్రైవ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని ప్రతి ఇంటా ఒక ఉద్యమంలా తీసుకెళ్తున్నామని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. అమర్ సింగ్ నాయక్ తెలిపారు. డెంగ్యూ, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల ప్రజలు అలసత్వం వహించకుండా, తమ ఇళ్ల పరిసరాల్లో లార్వాలు కనిపిస్తే వెంటనే ఆ నీటిని బయటకు పారబోసి పొడిగా ఉంచుకోవాలని, అధికారుల తనిఖీలకు నగరవాసులంతా పూర్తిగా సహకరించి ఈ దోమల నివారణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

- విద్యాశాఖ మంత్రి లోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి, జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్




**పుట్టపర్తి, ఆగస్టు 9 మనం న్యూస్:** డీఎస్సీ-2025 నియామకాల వ్యవహారంలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. రొద్దం మేజర్ పంచాయతీలో డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి రిలే నిరాహార దీక్ష మూడో రోజు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ అభ్యర్థులు, నిరుద్యోగ యువత నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్వతంత్ర సంస్థ అయిన సీబీఐతో నిష్పక్షపాత విచారణ జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఉషశ్రీ చరణ్ అన్నారు. విచారణకు ముందే ఎవరినీ దోషిగా తేల్చడం తమ ఉద్దేశం కాదని, అయితే ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగి నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి చదివి, కోచింగ్ తీసుకుని, కుటుంబాలకు దూరంగా కష్టపడ్డ నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీయడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడిన నియామక ప్రక్రియపై అనుమానాలు తలెత్తినప్పుడు ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సింది పోయి సమస్యను నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు.విద్యాశాఖకు మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తున్నందున, డీఎస్సీ వ్యవహారంపై వచ్చిన ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియపై ఇంతటి ఆరోపణలు వస్తున్నా బాధ్యత వహించకుండా తప్పించుకోవడం ఎందుకు? నిరుద్యోగుల ప్రశ్నలకు ప్రభుత్వం ఎప్పుడు సమాధానం చెబుతుంది? అని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలు, ఆరోపణలకు అతీతంగా డీఎస్సీ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని, బాధ్యత వహించే స్థాయిలో ఉన్న మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగ భృతితో పాటు యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని కోరారు.ఉద్యోగం కోసం చదివిన యువతకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు, ఆరోపణలపై సమగ్ర విచారణ పూర్తయ్యే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది. యువత గొంతుకగా నిలిచి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తా మని ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు.ఈ రిలే నిరాహార దీక్షకు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, వైసీపీ యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు



# సీసీ హరి ఆధ్వర్యంలో బోనాల కరపత్రం విడుదల

**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్:** జగన్మాత సృష్టికర్త ప్రపంచ మానవాళికి కొంగు బంగారమై విరాజిల్లు శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు, మాస్టర్ వీవర్ సిసి హరి పేర్కొన్నారు. సుమారు 1500 బోనాలతో కనుల పండుగగా అమ్మవారి బోనాల జాతర జరగనుంది. ఈ సందర్భంగా శనివారం సోమందేపల్లి లోని చౌడేశ్వరి కల్యాణ మండపం లో కుల బాంధవుల సమావేశాన్ని నిర్వహించారు. బోనాలకు సంబందించిన పంప్లెట్ ని తోగటవీర క్షత్రీయ సంఘం అధ్యక్షులు సీసీ హరి సమక్షంలో జ్యోతి సంఘం అధ్యక్షులు బండారు శీనా బోనాలకు సంబందించిన పంప్లెట్ ని విడుదల చేసారు.ఈ సందర్భంగాసీసీ హరి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాడ శుద్ధ అమావాస్య రోజున చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తెలంగాణ తరహాలో అమ్మవారికి బోనాలను సమర్పిస్తామని, ముఖ్యంగా యువతులు చిన్నారులు అమ్మవారి బోనాలు తలపై ధరించి గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించడం జరుగుతుందన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం.. ప్రతి ఊరికి అభివృద్ధి

- ఎమ్మెల్యే కాలవ



**రాయదుర్గం ఆగస్టు 8 మనం న్యూస్:** ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందుతోందని, అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అందుకే ఏ ఇంటికి వెళ్లిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి, ఆనందం కనిపిస్తోందన్నారు. రాయదుర్గం పట్టణంలో శనివారం 15వ వార్డులో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఇంటింటికీ తెలుగుదేశం' ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో పాటు.. వారి సమస్యలను నేరుగా తెలుసుకోగలుగుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి వారు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మిక కోడ్‌లు రద్దు చేసే వరకు ఉద్యమిద్దాం



- 10న జైలు బరో జయప్రదం చేయండి
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

**గజ్వేల్, ఆగస్టు 8 మనం న్యూస్‌:** క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మిక కోడులు రద్దు చేసే వరకు ఉద్యమించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సుందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈనెల 10న కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గజ్వేల్ మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం పూర్వం కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కానుకూలంగ నూతన లేబర్ కోడలు రూపొందించడం జరిగిందని పని గంటలు 12 గంటలకు పెంచడం, కార్మికులు, ఉద్యోగి నిర్వచనంలో నష్టం చేసే విధంగా ఉన్నాయని అన్నారు కార్మికులకు కనీస భద్రత చర్యలు ఎత్తివేయడం జరిగిందని, కార్మికుల భవిష్యత్తు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. వ్యవసాయ కార్మికుల ఉపాధి పథకం నిర్వీర్యం చేసిందని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లేకుండా, అమెరికాతో పాటు ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేయడం జరిగిందని అన్నారు. నూతన విద్యుత్ చట్టం ద్వారా విద్యుత్ ప్రైవేటీకరణ జరిగి కరెంట్ రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతు న్నారన్నారు దేశ ప్రజలు కార్మికులు రైతాంగం వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే చర్యలకు వ్యతిరేకంగా పదిన జరిగే జైలు బరో కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యాదగిరి, కుమార్, పరశురాములు, నర్సింలు, స్వామి, బాబు, బాలయ్య పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

- ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం ఉంటుంది
- ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం చాలా తక్కువ
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 08 (మనం బ్యూరో);** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద వస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపుకొని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు. కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్బరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళ్లు నిలువ చేయాల్సి వస్తుందన్నారు. కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందన్నారు. పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున, యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చన్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# స్కూటీని ఢీకొన్న కారు



- తండ్రి, కొడుకుకు తీవ్ర గాయాలు

**కాటారం, ఆగస్టు 08 మనం న్యూస్ :** స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో తండ్రి, కొడుకు తీవ్రంగా గాయపడిన ఘటన కాటారం మండలంలోని కొత్తపల్లి సమీపంలో 353(సీ) జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం పోలారం గ్రామానికి చెందిన బోడ సాంబయ్య, ఆయన కుమారుడు బోడ శ్రావణ్కుమార్ పని నిమిత్తం స్కూటీపై భూపాలపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో వరంగల్ కు చెందిన కాముని సంపత్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో కాళేశ్వరం వెళ్తున్నాడు. బయ్యారం-కొత్తపల్లి స్టేజీల మధ్య పెట్రోల్ బంక్ వద్ద ముందు వెళ్తున్న స్కూటీని కారు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న సాంబయ్య, శ్రావణ్కుమార్ లు రోడ్డుపై ఎగిరిపడటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను భూపాలపల్లిలోని 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులను అడిగి వివరాలు సేకరించారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

- ప్రజాపాలనలో అందిరికి లబ్ది
- ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తాం
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**ములుగు, ఆగస్టు 8(మనంన్యూస్)**:తెలం గాణలోని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించి ప్రభుత్వం అండగా ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ములుగులో వర్గల్ మాజీ ఎంపీపీ బాగనోళ్ళ మోహన్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు అందరూ కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొడిత్యాల ప్రభాకర్ గుప్త,పంచాయితీ రాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల్ల నరసింహ రెడ్డి,సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డితో కలిసి నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బడుగుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదలందరికీ రేషన్ కార్డులు ప్రభుత్వం అందించిందని తెలిపారు. త్వరలో రెండో విడత రేషన్ కార్డులను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,కావున అర్హులైన ప్రతి ఒక్కరు రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని నర్సారెడ్డి సూచించారు. రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అనేక మంది అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సంవత్సరాల తరబడి రేషన్ కార్డులు మంజూరు కాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులను గుర్తిస్తూ పెద్దఎత్తున కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ అర్హులైన ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సంక్షేమ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా కృషి జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు యంజాల ఐలేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర వీరేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కుతాడి శ్రీనివాస్, భుక్య శ్రీనివాస్, వాజిద్, మహేందర్, పుల్లబోయిన పతి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, కుమార్, మణిపవన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్,మంద వెంకటేష్, జాఫర్, సాయి భరత్ రెడ్డి, సంజీవ్ తో పాటు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నేడే వాసవి అమ్మవారి దేవాలయంలో శాఖంబరి అలంకరణ



- జగ్గయ్య గారి శేఖర్

**గజ్వేల్ ఆగస్టు 8 మనం న్యూస్‌:** గజ్వేల్ పట్టణంలోని రామాలయంలో వెలసిన శ్రీ వాసవి అమ్మవారి దేవాలయంలో శాఖంబరి అలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జగ్గయ్య గారి శేఖర్ తెలిపారు. ఆదివారం రోజున ఉదయం 8 గంటలకు గోపుజా 8-30 గంటలకు నుండి వాసవి అమ్మవారి ని శాఖంబరి అలంకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అలాగే. 9 గంటలకు కుంకుమార్చన కార్యక్రమం తో పాటు వాసవి అమ్మవారి పారాయణం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఇట్టి కార్యక్రమం లో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కా గలరని జగ్గయ్య గారి శేఖర్ కోరారు.

# గంజాయికి నో చెప్పండి జీవితానికి ఎస్ చెప్పండి




- గంజాయి పై అవగాహన కల్పించి పూతలపట్టు ఇన్‌స్పెక్టర్ తిమ్మయ్య

**పూతలపుట్టు ఆగస్టు 8.మనం న్యూస్:** జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.షాను పర్యవేక్షణలో పూతలపట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని మిడ్డిలయ్యగారి పల్లె హరిజనవాడ, రంగంపేట హరిజనవాడ ప్రాంతాల్లో పూతలపట్టు ఇన్స్పెక్టర్ తిమ్మయ్య, ఈగల్ టీమ్ సిబ్బంది ఆధ్వర్యంలో సే నో టు గంజా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూతలపట్టు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు విద్య, ఉద్యోగం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి విక్రయించడం, రవాణా చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు లేదా 1972 కు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ తిమ్మయ్య ప్రజలకు సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు.ఈగల్ టీమ్ సభ్యులు కూడా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించి, సే నో టు గంజా నినాదంతో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ప్రజలు మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు లేదా రవాణాకు సంబం ధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా 1972కు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఆదివాసి దినోత్సవం రోజున గిరిజన యువకుని జీవితంలో కొత్త వెలుగులు

**నగరి, ఆగస్టు 8 మనం న్యూస్:** ఒకప్పుడు ఆ ఆటోనే ఆ గిరిజన యువకుడి కుటుంబానికి జీవనాధారం... కానీ రాజకీయ కక్ష సాధింపుతో ఆ ఆటో అగ్నికి ఆహుతి కావడంతో ఒక్కసారిగా అతని బతుకు బండి ఆగిపోయింది. ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న పుత్తూరుకు చెందిన గిరిజన యువకుడు రాజాకు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఆర్కే రోజా మానవీయ హృదయంతో అండగా నిలిచారు. రాజా కష్టాలను తెలుసుకున్న రోజా శనివారం తన నివాస కార్యాలయంలో నిర్వహించిన ఆదివాసి దినోత్సవం లో తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొత్త ఆటోను వితరణగా అందించారు. దీంతో కేవలం ఒక వాహనాన్ని అందించడమే కాకుండా, ఉపాధిని కోల్పోయిన ఓ గిరిజన యువకుడికి తిరిగి జీవనాధారాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తుపై భరోసాను అందించారు.ఉపాధిని కోల్పోయి కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్న రాజాకు ఆటో అందడంతో అతని ముఖంలో చిరునవ్వు కనిపించింది. ఈ సందర్భంగా రాజా కుటుంబ సభ్యులు రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.అధికారం ఉన్నప్పుడు సహాయం చేయడం కంటే... అధికారం లేని సమయంలోనూ బాధితుడి కన్నీటిని తుడవడం గొప్ప మానవత్వం అని స్థానికులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలన్న రోజా చారిటబుల్ ట్రస్ట్ సేవా దృక్పథానికి ఈ ఘటన నిదర్శనమని కొనియాడారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఒక గిరిజన యువకుడి చేతికి ఆటో తాళాలు అందించడం ద్వారా రోజా అతనికి వాహనం మాత్రమే ఇవ్వలేదు... ఆగిపోయిన అతని జీవన ప్రయాణానికి మళ్లీ చక్రాలు తిప్పారు.

# ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోండి



- జిల్లా వ్యవసాయ అధికారి కే మల్లయ్య

**గజ్వేల్, ఆగస్టు 8 మనం న్యూస్:** రైతులకు ఎరువుల బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్ ( ఎఫ్ ఎఫ్ ఎస్) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానాన్ని గజ్వేల్ పట్టణంలోని శ్రీ శ్రీనివాస ట్రేడర్స్, షణ్ముఖ ట్రేడర్స్, శ్రీ శారద ట్రేడర్స్, తెలంగాణ అగ్రోస్, ఫెర్టిలైజర్ డీలర్ షాపుల్లో సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి కే మల్లయ్య గారు పరిశీలించడం జరిగింది., ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూరియా , డి ఏ పి,ఎం ఓ పి వివిధ రకాల పంటలకు ఉపయోగపడే కాంప్లెక్స్ ఎరువులను బుకింగ్ చేసుకునే విధానంలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖను సంప్రదించాలని అలాగే డీలర్లను మరియు కంపెనీ ప్రతినిధుల సహాయం తీసుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు డీలర్లు పాల్గొన్నారు.

# 'డ్రోన్ 'శిక్షణ క్యాంపుకు ఇద్దరు క్యాడేట్లు ఎంపిక



**హన్మకొండ, ఆగస్టు 8(మనం న్యూస్ ):** లాల్ బహదూర్ కళాశాల వరంగల్ ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో 'డ్రోన్ ' శిక్షణ క్యాంపుకు ఇద్దరు క్యాడేట్లు ఎంపిక అయ్యారు అనీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ హెచ్ రావు తెలిపినారు. ఎండి యాసిర్ అరాఫత్, బి మణికంఠ, డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నారని మీరు పోలీస్ శిక్షణ కళాశాల మమనూరులో వీరికి ప్రత్యేక శిక్షణ డ్రోన్ పరిజ్ఞానం పై ఆర్మీ నిపుణులచే పది రోజులు శిక్షణకు వెళ్లినట్లు వీరు ఈనెల 16 వరకు క్యాంపు కొనసాగుతుంది. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని సిఎ టిసి- 5వ క్యాంపు మామనూరు లో వీరు శిక్షణ కోసం వెళ్ళినట్లు వీరూ ఉన్నతమైన నైపుణ్య ప్రదర్శించి మంచి అవకాశాలు తీసుకొని రావాలని వీరికి శుభాకాంక్షలు ప్రిన్సిపాల్ తెలిపారు. అభినందించిన వారు కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్య నారాయణ, సెక్రెటరీ వినయ్ కుమార్, ఓ జి ఏ మరియు ఎగ్జిబిషన్స్ సొసైటీ హైదరాబాద్ మెంబర్స్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ సదానందం పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ కోదండరామస్వామివారి పవిత్రోత్సవాలు

**తిరుపతి ఆగస్టు 8 మనం న్యూస్:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి.ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు, అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల నివృత్తికి, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ˊ ఎవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు.పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పవిత్ర అభిషేకం నిర్వహించారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మంగళ విహారాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో తిలకించారు. రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిం చనున్నారు. ఆగస్టు 9న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో శ్రీమతి బి. నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం

- నంగునూరి సత్యనారాయణ
- లయన్స్ క్లబ్ ఆఫ్ మేదా ఆధ్వర్యంలో కీర్తి శేషులు బచ్చు రాజు నేత్రాలు సేకరణ



**గజ్వేల్ ఆగస్టు 8 మనం న్యూస్‌:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆర్యవైశ్య ఉపాధ్యాయుడు బచ్చు రాజు శనివారం అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్, లయన్ నంగునూరి సత్యనారాయణ,ఆధ్వర్యంలో గజ్వేల్ మెగా ఐ హాస్పిటల్ డాక్టర్ వై స్రవంతి పర్యవేక్షణలో, లయన్స్ క్లబ్ ఆఫ్ మేదా సభ్యుల సహకారంతో కీర్తిశేషులు బచ్చు రాజు నేత్రాలను సేకరించారు, వాటిని కంటి డాక్టర్ల పర్యవేక్షణలో భద్రపరిచారు ఈ సందర్భంగా లయన్ నంగునూరు సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ మేద అధ్యక్షులు లయన్ నాగేందర్, మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, మరణించిన వారి నేత్రాలను దానం చేస్తే మరో నలుగురికి కంటిచూపు ఇచ్చిన వారవుతారని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరణిం చిన వారి నేత్రాలను సేకరించడం జరుగుతుందని, నేత్రదానంపై అందరికీ అవగాహన అవసరమని ప్రతి ఒక్కరూ నేత్రదానం, అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని, మానవసేవే మాధవసేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

# సర్వజ్ఞ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు




**ఖమ్మం, ఆగస్టు 8(మనం న్యూస్):** ఖమ్మం పట్టణం విడిఒస్ కాలనీలోని ప్రముఖ విద్యాసంస్థ సర్వజ్ఞ పాఠశాలలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా బోనాల పండుగ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. బోనాలు అనేది తెలంగాణ ప్రజల ఆరాధ్య దేవత, గ్రామ దేవతలకు జరిపే పూజ. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను శాంతింపజేయడానికి, పంటలు బాగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ పండుగను జరుపుకుంటారు.

పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ 'బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదు, ఇదొక సామూహిక వేడుక. ఊరంతా కలిసి అమ్మవారిని కొలిచి, పల్లకి సేవలు, పోతరాజుల విన్యాసాలు, ఆడపడుచు నృత్యాలు, డప్పుల శబ్దాలతో సందడిగా జరుపుకుంటారని, ఇది ప్రజలలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె. నీలిమ మాట్లాడుతూ 'బోనాల పండుగ భక్తి శ్రద్ధలకు, సామూహిక సంతోషానికి ప్రతీక. వర్షాలు కురవడం ప్రారంభమయ్యే ఆషాఢ మాసం ప్రారంభంలో ఈ పండుగ వస్తుందని, భక్తులు తమ కోరికలు తీరినందుకు లేదా తీరాలని కోరుతూ 'బోనం' (అంటే భోజనం) సిద్ధం చేసి, పసుపు, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించిన కుండలలో నైవేద్యంగా అమ్మవారికి సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇది ప్రకృతితో మానవుడి సంబంధాన్ని, వ్యవసాయ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని తెలియజేయడానికి కట్టుబడి ఉందని, ఇటువంటి పండుగలు మన మూలాలను గుర్తుచేస్తాయని పేర్కొన్నారు.

# నైపుణ్యాలే విద్యార్థి భవిష్యత్తుకు పునాది




**ఖమ్మం, ఆగస్టు 8(మనం న్యూస్):** స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బి. టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత విద్యే బలమైన పునాది అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించాల్సిన బాధ్యతను, కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించేందుకు మార్గదర్శనం చేయాలనే ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథి రిటైర్డ్ ఐఏఎస్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పరిశోధనాత్మక దృక్పథంతో సమాజ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనిఅన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగాలకే పరిమితం చేయకుండా పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తే ప్రపంచ స్థాయిలో రాణించవచ్చని అన్నారు. విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు శ్రీ చైతన్య కట్టుబడి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జె లక్ష్మి నారాయణ స్వాగతం పలుకుతూ విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో కళాశాల యాజమాన్యం కీలకమని, పేరెంట్స్-టీచర్స్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుతూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కలశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ, ప్రొఫెషనల్ ప్రొఫ్రై దృష్టి పెట్టాలని, కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ, కళాశాలలో అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, ల్యాబొరేటరీలు, వివిధ శిక్షణా కార్యక్రమాలు, ప్లేస్మెంట్ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం

## కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్



**ఖమ్మం, ఆగస్టు 8(మనం బ్యూరో):** ఖమ్మం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ కోరారు. శనివారం కలెక్టర్‌ను యుగంధర్ మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఖమ్మంలో పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, విద్యుత్ పనులు వర్షాలను దృష్టి లో ఉంచుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఖమ్మానికి మణిహారం కానున్న ఖిల్లా రోప్ వే పనులు వేగవంతం చేయాలని, స్థలం కేటాయించిన వారికి ఎన్ఓసి మంజూరు చేసే ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన వారికి నూతన షాపులు మంజూరు చేయాలని సూచించారు. అండర్ డ్రైనేజీ పనులు వేగవంతంగా చేయాలని కోరారు. ఖమ్మం నగరంలో మైనారిటీ సోదరుల సౌకర్యార్థం నూతన షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. రిటైనింగ్ వాల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఖమ్మం నియోజకవర్గం లో నూతన ఓటరు నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని కోరారు. రఘునాథపాలెం మండలం గ్రామా పంచాయితీలో జరిగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మయూరి సెంటర్ అండర్ బ్రిడ్జి, బైపాస్ రోడ్డు బ్రిడ్జి రోడ్డులో చేపట్టే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే ఖమ్మం నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



# పత్రాలు లేని వాహనాలు నడిపితే చర్యలు

వైరా ఏసిపి సాదుల సారంగపాణి

వైరా రింగ్ రోడ్ లో వాహనాలు తనిఖీ

పత్రాలు లేని 50 బైకులు స్వాధీనం

**వైరా, ఆగస్టు 8(మనం న్యూస్):** ఎటువంటి పత్రాలు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వైరా ఏసిపి సాదుల సారంగపాణి అన్నారు. శనివారం వైరా రింగ్ రోడ్‌లో ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో వాహనం తనిఖీలు చేపట్టారు. ఈ వాహన తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేని 50 బైకులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తమ వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తమ వెంట సర్టిఫికెట్ తమ వంట ఉంచుకోవాలని సూచించారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ క్రైమ్ కావని, దీనివలన ఆ కుటుంబం వీధిన పడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్ సి కార్డు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తో పాటు హెల్మెంట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకటప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ 8 కోట్ల మేరకు కుంభకోణం

## అప్పుచేసి అభివృద్ధి అవసరమా..

నాడు వ్యతిరేకించి.... నేడు అంగీకరించడం పార్టీ సిద్ధాంతమా?

ప్రశ్నించిన కార్పొరేటర్లు కంభంపాటి దుర్గాప్రసాద్, భీమా శ్రీవల్లి



**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 8 (మనం న్యూస్):** అభివృద్ధి పేరుతో కార్పొరేషన్ ప్రజలపై పెను భారం మోపే ప్రయత్నం చేస్తున్నారని , డిపిఆర్ పేరుతో రూ 8 కోట్లు పక్కదారి పట్టాయంటూ బిఆర్ఎస్ కార్పొరేటర్లు కంభంపాటి దుర్గాప్రసాద్, బీమా శ్రీవల్లి ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెల 6న ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ రూ.600 కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రణాళిక రూపొందించారని, వాటిలో రూ.300 కోట్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు కాగా, మరో 300 కోట్లు జర్మనీ బ్యాంకు నుంచి అప్పు తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారని అన్నారు. జర్మనీ బ్యాంకుకు 13 శాతం వడ్డీతో ప్రతి ఏటా 39 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 600 కోట్ల అభివృద్ధి పనులకు గాను డిపిఆర్ నిమిత్తం రూ 9.60 కోట్లు ప్రతిపాదించారని, డిపిఆర్‌లో భారీ కుంభకోణం చోటుచేసుకుందని వాళ్ళ ఆరోపించారు. డిపిఆర్‌కు కేవలం రూ 1.60 కోట్లు మాత్రమే అవసరమంటుందని, మిగిలిన రూ 8 కోట్లు వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావు ఉన్న హయాంలో రూ 44 కోట్ల ప్రపంచ బ్యాంకు అప్పు కోసం ప్రయత్నిస్తే మాజీ ఎమ్మెల్యే హోదాలో ప్రస్తుత ఎమ్మెల్యే సాంబశివరావు ధర్నా చేసి వ్యతిరేకించారని, ప్రస్తుతం జర్మనీ బ్యాంకుకు 300 కోట్లు అప్పుకు ఎందుకు అనుమతించారని, పార్టీ సిద్ధాంతం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే కిన్నెరసాని జలాలపై ఆనాడు రూ 22 కోట్లతో చేపట్టిన పథకం ప్రస్తుతం అసలు వడ్డీ కలిపి 220 కోట్లకు చేరుకుందని, ఆ అప్పునే ప్రస్తుతం చెల్లించలేని పరిస్థితిలో మున్సిపల్ కార్పొరేషన్ ఉందని అన్నారు. మూలిగే నక్కపై తాటి పండు అన్న చందాన జర్మనీ బ్యాంకు నుంచి 300 కోట్లు అప్పు చేయటం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై పన్నుల భారం మోపటమేనని వారన్నారు. ఈ నిధులతో ఆర్టీసీ బస్టాండ్ స్థానంలో కొత్త బస్టాండ్ నిర్మాణం చేయడం, సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం, కొత్త మున్సిపల్ కార్పొరేషన్ భవనం నిర్మాణం చేపట్టడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వాటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు ప్రయత్నం చేయాలే తప్ప, అప్పు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఆదాయ వనరులు లేని మున్సిపల్ కార్పొరేషన్ పై అప్పుల భారం మోపటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా జర్మనీ బ్యాంక్ నిధుల ప్రతిపాదనను విరమించుకోవాలని, డిపిఆర్ లో పక్కదారి పట్టిన 8 కోట్ల వివరాలు బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ





**ములకలపల్లి, ఆగస్ట్ 8(మనం న్యూస్) :** ములకలపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి), సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కళాశాల, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి)ని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీ ని సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థినులతో ముచ్చటించి, కాసేపు తరగతి గదిలో పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని సూచించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మెస్‌ను పరిశీలించి, భోజన నాణ్యతపై ఆరా తీశారు. నిర్దేశిత మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని, నాణ్యతలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. చివరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి హెచ్ సి) తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా, వైద్య లక్ష్యాలను నీరుగార్చవద్దని అధికారులకు, యాజమాన్యానికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ (జెడ్ పి టి సి) బత్తుల అంజి ,మాజీ సర్పంచ కారం సుధీర్, సేవాదళ్ నాయకులు తిరపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సుమిత్ ,వంశీ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ ఆపరేషన్‌లో రాజస్థాన్-హైదరాబాద్

# డ్రగ్స్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ముఠా అరెస్ట్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రాజస్థాన్ - హైదరాబాద్ డ్రగ్స్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టయింది. తెలంగాణ ఈగల్ ఫోర్స్ చేపట్టిన భారీ ఆపరేషన్‌లో రెండు వేర్వేరు కేసుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల దగ్గరి నుంచి 1.031 కిలోల నల్లమందును (ఓపీయం) స్వాధీనం చేసుకున్నారు. మరో 25 గ్రాముల మెఫెడ్రోన్ సీజ్ చేశారు. మియాపూర్, సైదాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే, రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు ఈ ముఠా డ్రగ్స్ సరఫరా చేస్తోంది. సప్లయర్లు, మధ్యవర్తులు, కొరియర్లు, డెలివరీ ఏజెంట్‌లతో ఈ నెట్‌వర్క్ నడిపిస్తున్నట్లు ఈగల్ అధికారులు గుర్తించారు. ప్రైవేట్ బస్సులు, రైళ్లు, కార్ల ద్వారా ఈ డ్రగ్స్ తరలించారు. డ్రగ్స్ లావాదేవీలకు డిజిటల్ కమ్యూనికేషన్, యూపీఐ ట్రాన్సాక్షన్లు కొనసాగిస్తున్నట్లు ఈగల్ అధికారుల దర్యాప్తులో తేలింది. 2023 నుంచి రాజస్థాన్ లింక్ ఉన్న 78 డ్రగ్స్ ట్రాఫికింగ్ ప్రయత్నాలను తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు. యువతను కొరియర్లు, డెలివరీ ఏజెంట్లుగా ఈ డ్రగ్స్ ముఠాలు వాడుతున్నాయని విచారణలో తేలింది. రాజస్థాన్ లింక్ నెట్‌వర్క్‌లలో తరచుగా, ఓపీయం, డోడా చూరాను గుర్తించారు. మియాపూర్ కేసులో రాజస్థాన్‌కు చెందిన మహేందర్ కుమావత్ డ్రగ్స్ పంపించారు. బెంగళూరు మీదుగా హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలించినట్లు దర్యాప్తులో వెల్లడించారు. డ్రగ్స్ తరలింపులో ఖు ట్రావెల్స్ డ్రైవర్‌ను కూడా ఉపయోగించారు. నిందితుల దగ్గరి నుంచి మొబైల్స్, నగదు, వాహనాలు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి తెలంగాణకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న విస్తృత నెట్‌వర్క్‌పై ఈగల్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.



# సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, ఆగస్టు 8(మనం బ్యూరో):** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎల్నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యం లో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుందనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని అన్నారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# ఇంటర్ బోర్డు వ్యాపార లీలలు




- **ర్యాంకులు నకిలీ.. భద్రత నకిలీ.. సర్టిఫికెట్లు నకిలీ**
- **కార్పొరేట్ కాలేజీల దొంగ నాటకాలకు అధికారుల 'లైసెన్స్'**
- **రూ.8 లక్షల పెనాల్టీల వెనుక బోర్డు పెద్దల సేఫ్ గేమ్**

**హైదరాబాద్,ఆగస్టు 8(మనం న్యూస్):** తెలంగాణ విద్యావ్యవస్థను నకిలీల భూతం పట్టి పీడిస్తోంది. జ్ఞానాన్ని అందించాల్సిన అక్షర దేవాలయాలు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంటే, పర్యవేక్షించాల్సిన ఇంటర్మీడియట్ బోర్డు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ కొలువులు దక్కించుకుంటే, విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రైవేట్ కాలేజీలు నకిలీ ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీలతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల కాసుల కక్కుర్తికి, బోర్డు అధికారుల ఉదాసీనత తోడవడంతో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థ పూర్తిగా కునారిల్లుతోంది. బలిపశువులవుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'మనం' అందిస్తున్న ప్రత్యేక పరిశోధనాత్మక కథనం.

**గురువులే దొంగలైతే..:**

**35 మంది ప్రభుత్వ జేఎల్ ల గుట్టు రట్టు!**

రాష్ట్రంలోని పలు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విధుల్లో చేరిన 35 మంది జూనియర్ లెక్చరర్ల (జేఎల్) సర్టిఫికెట్ల భాగోతం విద్యాశాఖ తనిఖీల్లో బట్టబయలైంది. వీరంతా ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల నుంచి నకిలీ పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) సర్టిఫికెట్లు కొనుగోలు చేసి, పవిత్రమైన బోధనా వృత్తిలోకి అక్రమంగా ప్రవేశించారు. విద్యాశాఖ అంతర్గతంగా నిర్వహించిన క్షుణ్ణమైన వెరిఫికేషన్ లో ఈ ఘోరం వెలుగుచూసింది. నిర్మల్, సిరిసిల్ల, నాగర్కర్నూల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సంగారెడ్డి, సూర్యాపేట, రంగారెడ్డి, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, ఖమ్మం, నల్గొండ, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లోని ప్రభుత్వ కాలేజీల్లో ఈ నకిలీ లెక్చరర్లు దర్జాగా కొలువులు వెలగబెడుతుండటం గమనార్హం.ఈ వ్యవహారంపై స్పందించిన ఇంటర్మీడియట్ బోర్డు సదరు 35 మంది లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ సర్టిఫికెట్ల నిజాయితీపై ఆధారాలతో సహా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అయితే, విద్యాశాఖ సెక్రటరీ ప్రస్తుతం సెలవులో ఉండటంతో తదుపరి కఠిన చర్యలపై కొంత సందిగ్ధత నెలకొంది. అర్హులైన ఎంతోమంది నిరుద్యోగుల పొట్టకొట్టి, నకిలీ పత్రాలతో చేరిన వీరిని కేవలం నోటీసులతో సరిపెట్టకుండా తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రాణాలతో చెలగాటం... నకిలీ ఫైర్ ఎన్ఓసీలు!**

ఇదిలా ఉంటే, ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు లాభార్జనే ధ్యేయంగా విద్యార్థుల ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నాయి. కనీస భద్రతా ప్రమాణాలు లేని భవనాలలో కాలేజీలు నడుపుతూ, ఇంటర్ బోర్డు గుర్తింపు కోసం ఏకంగా నకిలీ ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీలను సృష్టించాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమాలకు పాల్పడిన 52 ప్రైవేటు జూనియర్ కాలేజీలను బోర్డు అధికారులు గుర్తించారు. అయితే, వేలాది మంది విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోలోకి నెట్టిన ఈ యాజమాన్యాలపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోకుండా, సీళ్లు వేయకుండా కేవలం ఒక్కో కాలేజీకి రూ. 8 లక్షల చొప్పున పెనాల్టీ విధించేందుకు బోర్డు సిద్ధమవడం పలు అనుమానాలకు తావిస్తోంది

**నకిలీ ర్యాంకుల మాయాజాలం.. తప్పుదోవ పడుతున్న తల్లిదండ్రులు!**

ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల దొంగ నాటకాలు ఇంతటితో ఆగడం లేదు. అడ్మిషన్ల సీజన్ వచ్చిందంటే చాలు, కోట్లాది రూపాయల ప్రకటనలతో పేపర్లను, టీవీలను ముంచెత్తుతాయి. దేశంలో ఎక్కడో వచ్చిన ర్యాంకులను తమ కాలేజీ విద్యార్థులకే వచ్చినట్లు నకిలీ ర్యాంకుల బోర్డులు, ఫ్లెక్సీలు తగిలించి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. ఒకే విద్యార్థి ఫొటో నాలుగు వేర్వేరు కాలేజీల ప్రకటనల్లో దర్శనమిస్తున్నా ఇంటర్ బోర్డులోని పర్యవేక్షణ విభాగం కళ్ళు మూసుకుని కూర్చుంటుంది. ఈ నకిలీ ర్యాంకుల మాయాజాలంలో చిక్కుకుని, లక్షలాది రూపాయల ఫీజులు కట్టి మధ్యతరగతి తల్లిదండ్రులు నిలువునా మునుగుతున్నారు. కార్పొరేట్ కాలేజీల ఒత్తిడిని తట్టుకోలేక, ర్యాంకుల ఉచ్చులో చిక్కుకుని ప్రతి ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, ఈ అక్రమ ర్యాంకుల ప్రచారాలపై బోర్డు ఎలాంటి నియంత్రణ విధించకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

**విద్యావ్యవస్థకు పట్టిన శని!**

ఈ మొత్తం వ్యవహారంలో ఇంటర్మీడియట్ బోర్డు పెద్దల పాత్ర అత్యంత విమర్శనాస్పదంగా మారింది. ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులతో బోర్డు ఉన్నతాధికారులు లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుంటూ, తనిఖీలను కేవలం కాగితాలకే పరిమితం చేస్తున్నారు. కాలేజీల మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ఏటా గుర్తింపు ఎలా ఇస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఫేక్ సర్టిఫికెట్లు, లెక్చరర్ల నియామకంపై గానీ, నకిలీ ఎన్ఓసీల సమర్పణపై గానీ ఇంటర్ బోర్డు అంతర్గత విచారణల పేరుతో కాలయాపన చేస్తోంది తప్ప బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఇంటర్మీడియట్ బోర్డులో పేరుకుపోయిన అవినీతి తిమింగలాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. నకిలీ ఎన్ఓసీలు సమర్పించిన ప్రైవేట్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి. విద్యార్థుల ప్రాణాలతో, వారి బంగారు భవిష్యత్తుతో ఆడుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థల దొంగ నాటకాలకు చరమగీతం పాడకపోతే, సమాజానికి కోలుకోలేని నష్టం వాటిల్లుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## మహానందిలో ఏపి వక్స్ బోర్డ్ చైర్మన్ పూజలు



**మహానంది, ఆగస్టు8,మనంన్యూస్:** మహానందీశ్వరుని సన్నిధిలో ఆంధ్ర ప్రదేశ్ వక్స్ బోర్డ్ చైర్మన్ రామచంద్రుడు,ఆడిట్ డైరెక్టర్ హరి ప్రకాష్ లు పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారి దర్శనానికి వచ్చిన వారికి సూపరింటెంట్ నీలఖంటేశ్వర రాజు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితి ప్రకారం వేదపండితులుశాంతారాం బట్వేదాశీర్వచనం మధ్య కండువా కప్పు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## శ్రీ మఠంలో మానవ హక్కుల కమీషన్ మెంబర్ డాక్టర్ కిషోర్



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్:** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ కిషోర్ కుటుంబ సభ్యులతో శనివారం వచ్చారు. వారికి మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి , సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , ఫల మంత్రాక్షితలు , రాఘవేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. మఠం ఇంజినీర్ సురేష్ కొనపూర్ , తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వం అందరికీ భరోసానిస్తోంది



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందని మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ అన్నారు. శనివారం టిడిపి ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని చట్నీహళ్లి గ్రామంలో టిడిపి ఇంటింటికి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ముందుగా టిడిపి ప్రకటించిన హామీల బుక్ లెట్ ను ఇస్తూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైస్తవు సోదరులకు అన్నివిధాలా అండగా ఉంటా



- చర్చికి రూ. 7.50 లక్షలం సౌండ్ సిస్టం విరాళం
- మంత్రాలయం ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి

**మంత్రాలయం, ఆగస్ట్ 8,మనం న్యూస్:** మంత్రాలయం నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని 52-బసాపురం గ్రామంలో ఉన్న లివింగ్ మినిస్ట్రీస్ చర్చికి యువనేత ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 7.50 లక్షల సౌండ్ సిస్టం ను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం లోని క్రైస్తవ సోదరులకు మా దృష్టిలో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. రాబోయే భవిష్యత్ లో సైతం క్రైస్తవు సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో చర్చి కి సౌండ్ సిస్టం విరాళం అందించినందుకు లివింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థపాకులు పాస్టర్ సామేలు అయ్యగారు ఎంఎల్ఏ కు, ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి వైసిపి మండల అధ్యక్షులు గురెడ్డి భీంరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

- కూటమి ప్రభుత్వం డీఎస్సీ అక్రమాలతో నిరోద్యోగులను దగా చేసింది



**కౌతాళం, ఆగస్టు 08 మనం న్యూస్:** డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఆగస్టు 6 నుంచి 9 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం చేపట్టిన డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సంవత్సరాల తరబడి శ్రమించిన నిరుద్యోగ యువతలో ప్రస్తుతం నెలకొన్న ఆందోళనకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. నియామక ప్రక్రియపై అభ్యర్థులు లేవనెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ఆరోపణలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఒక్క అభ్యర్థికి కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.డీఎస్సీ అభ్యర్థుల సమస్య కేవలం ఉద్యోగ నియామకానికి సంబంధించిన అంశం కాదని, వేలాది కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విషయమని పేర్కొన్నారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి వెంట నిలిచి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.యువత భవిష్యత్తును ప్రభావితం చేసే ఉద్యోగ నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉందన్నారు.డీఎస్సీ అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుని,వారి సందేహాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు. నియామక ప్రక్రియపై సమగ్రంగా సమీక్షించి అర్హులైన అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జైపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. డీఎస్సీ అభ్యర్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ఉద్యమిస్తున్నారని, వారి ఆందోళనలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం వారి పక్షాన నిలుస్తుందని తెలిపారు.డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దేశాయి ప్రహ్లాద ఆచారి గారు మాట్లాడుతూ డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలు, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావా లని నాయకులు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలిచి పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.మంత్రాలయంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైయస్ఆ మంత్రాలయం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మండల యువజన విభాగం అధ్యక్షులు తదితర నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఎమ్మెల్యే పిఏ వెంకటరామిరెడ్డి, మాబుసాబ్,మాజీ సర్పంచ్ పాల్ దినకర్, ఏకాంబరం రెడ్డి, రౌడూర్ ఆర్ఎం,సుధాకర్ రెడ్డి,నది చాగి లింగన్న గౌడ్ సూలేకేరి ఆదినారాయణ రెడ్డి,తహేర్ వలి, ఇద్రుస్,జైపాల్, మంత్రాలయం సోషల్ మీడియా తోవి గౌతమ్,సక్రి శ్రీరామ్,వడ్డే నరసింహ, రామకృష్ణ,ఎన్టీఆర్ నగర్ భాషా,జీడి . ఖదీర్,అనీఫ్ సుధాకర్,బసవ మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు మండలం యువజన విభాగ అధ్యక్షులు కార్యదర్శు లు కౌతాళం మండల వివిధ గ్రామాలుకు సంబంధించిన సర్పంచులు నాయకులు కార్యకర్తలు అభిమానులు వారి అందరికీ సంఘీభావం తెలిపారు.

## ప్రసాదాల తయారీ వద్ద పరిశుభ్రంగా ఉండాలి



- చైర్మన్ నరాల

**మహానంది, ఆగస్టు8,మనంన్యూస్:** పవిత్రమైన ప్రసాదాల తయారికేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది పరిశుభ్రతను పాటించాలని మహానందీశ్వర స్వామివారి చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి కోరారు. శనివారం కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన వారికి సూపర్డెంట్ శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు.అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలునిర్వహి ంచారు. ఆలయ ఆనవాయితి ప్రకారం కళ్యాణ మండపంలో చైర్మన్ కుటుంబ సభ్యులను వేదపండితులు హనుమంతు శర్మ వేదాశీర్వచనం మధ్య కండువా కప్పి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ప్రసాదాల తయారీ కేంద్రంలో లడ్డు, పులిహోరా తయారు చేసేటప్పుడు సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలన్నారు. స్నానం చేసిన తరువాత నే ప్రసాదాల తయారీ కేంద్రం లోకి రావాలని తెలిపారు. వారివెంట పాలకమండలి సభ్యులు నాగేషుడు,టెంపుల్ ఇన్స్పెక్టర్ నగమల్లయ్య, బూత్ కన్వీనర్ హరిప్రసాద్ రెడ్డి, మహిళా నాయకురాలు ఉమాదేవి,తదితరులు వున్నారు.

## మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జైల్‌బరో

- కార్మికులు, రైతులు, ప్రజలు కదం తొక్కాలి
- దేవనకొండ సమావేశంలో కార్మిక సంఘ నాయకుల పిలుపు



**దేవనకొండ, ఆగస్టు 8, ( మనం న్యూస్ ):** కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను హరిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్భరో, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎం. నరసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కార్మిక సంఘాల సమావేశం సిఐటియు మండల కార్యదర్శి ఎమ్.అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికులు చెమటోడ్చి సంపద సృష్టిస్తున్నా వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదన్నారు. రూ.31 వేల కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ పనుల్లో కొనసాగుతున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని విమర్శించారు. అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతుల రుణాలు మాఫీ చేసి, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసే చర్యలను ఆపాలన్నారు. 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలన్నారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యుడి జీవితం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కుల, మతాల పేరుతో విడదీసే రాజకీయాలను తిప్పికొట్టి, కార్మికులు-రైతులు-ప్రజలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేయాలని, హంద్రీ-నీవా ద్వారా పంటలకు సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 10న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే జైల్భరో, నిరసన కార్యక్రమాలకు వేలాదిగా తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి గట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక,రైతు, వ్యవసాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు యూసుఫ్ భాష,కృష్ణ, వై.మహేంద్ర,రామంజి, భాస్కర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాలు వస్తే వైసీపీకి ఎందుకు కడుపుమంట?

**ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించడం కూడా తప్పేనా?: రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్**



**దేవనకొండ మనం న్యూస్:** మెగా డిఎస్సి ద్వారా యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైసీపీ నేతలకు ఎందుకు కడుపుమంట? ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడాన్ని కూడా రాజకీయంగా చూడటం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. శనివారం ఆమె మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు రావడం చూసి సంతోషించాల్సింది పోయి, రాజకీయ బురద జల్లడం వైసీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో యువత ఎదుర్కొన్న నిరాశను ప్రజలు మర్చిపోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, దాన్ని కూడా జీర్ణించుకోలేక విమర్శలు చేయడం వారి అసహనాన్ని బయటపెడుతోందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, విద్యారంగాన్ని బలోపేతం చేయడం, నిరుద్యోగ యువతలో నమ్మకాన్ని పెంచడం లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. వైసీపీ నాయకులకు ఒకటే చెబుతున్నాం-యువత విజయాలను రాజకీయాలకు లాగవద్దు. రాజకీయాలు చేయాలంటే ప్రజా సమస్యలపై చేయండి. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడం తప్పు కాదు. యువతకు ఉద్యోగాలు రావడం రాష్ట్రానికి గర్వకారణం అని కప్పట్రాళ్ల బొజ్జమ్మ స్పష్టం చేశారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగద్దు



**కౌతాళం,ఆగష్టు 08 మనం న్యూస్ :** మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ నరసింహ ఈరన్న స్వామి శ్రావణమాసం సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి వాణి ఆధ్వర్యంలో వేగంగా పనులు మొదలు పెట్టారు.ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్ వాణి మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే శ్రావణమాసం మహోత్సవం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా దగ్గరుండి పనులు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటికే భక్తులకు రాక,పోకలు ఇబ్బంది కలవకూడదని. ఉద్దేశంతో రోడ్డు పనులు కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా రోడ్డు ఇరు వైపులా అడ్డంగా ఉన్న చెట్టును కూడా తొలగిస్తున్నామని తెలిపారు.ఏది ఏమైనా భక్తుల శ్రేయస్సే మాకు ముఖ్యమని తెలిపారు. ఈ శ్రావణమాసం మహోత్సవం ప్రతి ఒక్కరు సహకారంతో ముందుకు వెళ్లి జయప్రదం చేయాలని ఆలయ డిప్యూటీ కమీషనర్, కార్య నిర్వహణ అధికారి వాణి తెలిపారు.

## జగ్గాపురంలో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

- ఇంటింటికీ వెళ్లిన టీడీపీ నాయకులు.. ప్రజలతో మమేకం
- జగ్గాపురంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం



**నందవరం ఆగస్టు 8 మనం న్యూస్:** నందవరం మండల పరిధిలోని స్థానిక జగ్గాపురం గ్రామంలో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం కొనసాగించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు టిడిపి గ్రామ అధ్యక్షులు ఎల్ఐసి గోపాల్ టిడిపి సీనియర్ నాయకులు నరసింహులు రంగన్న తిమ్మప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జగ్గాపురం గ్రామంలో గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి పథకాలు తీసుకువస్తారని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బూత్ ఇన్చార్జి రుద్ర స్వామి. చిన్న ఈరన్న మరియు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నషా కాదు.. నైపుణ్యం కావాలి!




- నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

**ధర్మవరం, ఆగస్టు 8 మనం న్యూస్ మనం న్యూస్:** "సిగరెట్ కాదు.. శిక్షణ కావాలి. మద్యం కాదు.. మంచి భవిష్యత్తు కావాలి. డ్రగ్స్ కాదు.. డ్రీమ్స్ కావాలి. నిషా కాదు.. నైపుణ్యం కావాలి. వ్యసనం కాదు.. విజయం కావాలి" అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపితేనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ధర్మవరం పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన '10 నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మద్యం, బీడి, సిగరెట్, గుట్కా, గంజాయి, డ్రగ్స్తో పాటు మొబైల్ ఫోన్ వ్యసనం కూడా పిల్లలు, యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. వ్యసనాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ, సామాజిక జీవితం దెబ్బతింటాయని చెప్పారు.

# మట్కా బీటర్లు అరెస్టు

### రూ. 18450 నగదు ,సెల్ ఫోన్‌లు స్వాధీనం

**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో మట్కా బీటర్లు ను మాధవరం పోలీసులు శనివారం పట్టుకున్నారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలు మేరకు రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ రామలింగప్ప , విద్యానగర్ తాండ గ్రామానికి చెందిన బోయరాజు , గంగులప్ప లు రచ్చుమర్రి గ్రామంలో తిమ్మప్ప తాత మఠం దగ్గర ఆన్లైన్ యాప్ ద్వారా మట్కా ఆడుతుండగా రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి ముగ్గురిని అదుపులో తీసుకొని వారి వద్ద ఉన్న రూ. 18,450 నగదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా మట్కా రాసిన లేదా ఆడిన క్రికెట్ బెట్టింగ్ ,తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

# అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యం



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజులు అన్నారు. శనివారం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయంలోని పలు కాలనీలో ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు పథకాల గురించి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పవన్ కుమార్ టిడిపి నాయకులు రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

# ప్రజాసేవే ధ్యేయంగా ఎమ్మెల్యే



**కళ్యాణదుర్గం టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్:** ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముందుకు సాగుతున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికలో 53 మంది అనారోగ్య బాధితులకు మొత్తం రూ.33,16,801 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాల పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## నేతన్నల ఆధ్వర్యంలో నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం



**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 8 మనం న్యూస్:** చేనేతల మనగుడి కోసం ఏపీలోని కుటుంబ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని 72 వేలమంది చేనేతలకు 25000 చొప్పున ఆర్థిక సాయం అందించడం పట్ల సోమ0దేపల్లి మండలంలోని చేనేతలు హర్షం వెలిబుచ్చారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి సవిత చిత్ర పటాలకు కూటమి నాయకులతో కలిసి పాలభిషేకం చేసారు. నేతన్న సేవ పథకం ద్వారా చేనేతలకు 25 వేలు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో నేతన్న సేవ లేకున్నా, మంత్రి సవిత చొరవతో ఈ పథకం ద్వారా 25 వేలు నేతన్నకు వేసినందుకు సీఎం కు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ హయాంలో నేతన్నకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి,పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రమణ, పిఎన్ రామాంజి,అన్సర్ బాషా,శివశంకర్ యాదవ్, నాగరాజ్ యాదవ్, డిఆర్ సోమశేఖర్, డీలర్ పెద్దకొడిపల్లి ప్రకాష్, బాలు, పరందమా, జనసేన నాగరాజు,జక్కా చంద్ర,ఉప్పర బాబయ్య,చలపతి, కొట్టాల్ మన్సూర్, బంగారు,నేతన్నలు నారాయణస్వామి, గోవింద్, రామకృష్ణ, వేణు, ఆచారి, నరసింహ, రాధా, చంద్ర, జనసేన వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ యుద్ధం నుంచి ఇక బయటపడదాం

## ట్రంప్‌నకు జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ సలహా



**వాషింగ్టన్, ఆగష్టు 8:** గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అధ్యక్షుడు ట్రంప్ కార్యవర్గానికి అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

''ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలి'' అని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌లతోనూ చర్చలు జరిపారట.

ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్ దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణుల నిల్వలు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ప్లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.

# భారత్‌పై 100శాతం టారిఫ్‌ల భారం..

## బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం



**వాషింగ్టన్, ఆగష్టు 8:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఇటీవల మృతిచెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా , ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 86-11తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈ బిల్లు ప్రతినిధుల సభ ముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్టరూపం దాల్చనుంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే భారత్‌పై 100 శాతం సుంకాలను విధించనున్నారు.

ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది. ఇది అమల్లోకి వస్తే భారత్, చైనా, స్లొవేకియా, హంగరీ, అజ్బైజాన్ వంటి దేశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ టారిఫ్లు 500శాతం వరకు ఉండాలని ట్రంప్ సర్కార్ ప్రతిపాదించింది. ఆ తర్వాత పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అంతర్జాతీయ పరిణామాలతో సుంకాల పరిమితిని సవరించి 100 శాతానికి తగ్గించారు.

## ఆ కంటెంట్‌తో యువత మానసిక ఆరోగ్యానికి నష్టం

### మెటాకు అమెరికా కోర్టు రూ.5,400 కోట్ల భారీ జరిమానా




**వాషింగ్టన్, ఆగష్టు 8:** మెటాకు చెందిన సామాజిక మాధ్యమాల వల్ల పిల్లలు, యువతకు జరిగిన మానసిక నష్టాల ఉపశమనానికీ, వారి చికిత్సకూ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల మాతృ సంస్థ మెటా 56.7 కోట్ల డాలర్లు (రూ.5,400 కోట్లు) చెల్లించాలని అమెరికాలోని న్యూ మెక్సికో కోర్టు ఆదేశించింది. ఈ మొత్తంలో 42 కోట్ల డాలర్ల (రూ.3,997 కోట్లు)ను యువతకు చికిత్స సేవల కోసం ఉపయోగించాలనీ, మిగిలిన నిధులను అవగాహన, నివారణ, స్క్రీనింగ్ సేవలకు, రాబోయే ఐదేళ్లలో ఇతర ఖర్చులకూ వెచ్చించాలని జడ్జి బ్రాయన్ బీడ్ షీడ్ ఆదేశించారు. మొదటి దశ విచారణలో మెటాకు విధించిన 37.5 కోట్ల డాలర్ల (రూ.3,569 కోట్లు)జరిమానాకు ఇది అదనం. దీంతో మెటాపై మొత్తం 94.2 కోట్ల డాలర్ల (రూ.8,967 కోట్లు) జరిమానా విధించినట్లయింది. మెటా సామాజిక మాధ్యమ వేదికలు యువ వినియోగదారులకు తీరని నష్టం కలిగించాయని న్యూమెక్సికో కోర్టు తేల్చింది.

# ఒకరిపై దాడి చేస్తే.. ముగ్గురిపై చేసినట్లే

## పాక్, తుర్కియే, సౌదీ మధ్య 'మక్కా ఒప్పందం'



**ఇస్లామాబాద్, ఆగష్టు 8:** పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా కీలక త్రైపాక్షిక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా- ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా.. దాన్ని మిగిలిన రెండు దేశాలపైనా దాడిగా పరిగణిస్తారు. మక్కాలో ఈ ఒప్పందంపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ పట్టపు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ శుక్రవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందానికి 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' అని నామకరణం చేశారు. దురాక్రమణలకు వ్యతిరేకంగా సమష్టి భద్రతను బలోపేతం చేసుకునేందుకు ఈ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నట్టు మూడు దేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ఇప్పటికే పాకిస్థాన్, సౌదీ ఇలాంటి ఒప్పందంలో ఉన్నాయి.

ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ, సాంకేతిక బదిలీ, నిఘా సమాచారం మార్పిడికి ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

కొన్ని నెలలుగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా సౌదీ అరేబియాపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. వీటితోపాటు మౌలిక సదుపాయాలు, చమురు నిల్వలపైనా డ్రోన్లు, క్షిపణి దాడులు జరుగుతున్నాయి. మరోవైపు గాజా విషయంలో తుర్కియే, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఈ త్రైపాక్షిక ఒప్పందం ప్రాధాన్యం సంతరించుకుంది.

**స్పందించిన ఇరాన్..**

మూడు దేశాల రక్షణ ఒప్పందంపై ఇరాన్ స్పందించింది. ఒప్పందంపై మూడు దేశాలు సంతకాలు చేసినప్పటికీ.. ఆ కాగితపు ఒప్పందం శాశ్వత భద్రతకు హామీ ఇవ్వదనే విషయాన్ని సౌదీ తెలుసుకోవాలని ఇరాన్ పార్లమెంట్, నేషనల్ సెక్యూరిటీ అండ్ ఫారిన్ పాలసీ కమిషన్ సభ్యుడు ఇబ్రహీం రెజాయి పేర్కొన్నారు. సౌదీ అరేబియా తన విధానాలను మార్చుకుంటే.. భద్రత కోసం ఇతరులను వేడుకోవాల్సిన అవసరం ఉండదన్నారు.

# 'మహాలక్ష్మి' పథకం విస్తరణ..



- మరో 5 లక్షల కుటుంబాలకు రూ.500 గ్యాస్
- కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పెరిగిన అర్హుల సంఖ్య
- కొత్త లబ్ధిదారుల జాబితా ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపిన పౌరసరఫరాలు
- ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 42.90 లక్షల కుటుంబాలకు అందుతున్న సబ్సిడీ
- ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత నేరుగా ఖాతాల్లోకి సబ్సిడీ జమ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక 'మహాలక్ష్మి' పథకాన్ని మరింత మందికి చేరువ చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ పథకంలో భాగమైన రూ.500కే గ్యాస్ సిలిండర్ సదుపాయాన్ని కొత్తగా మరో 5 లక్షలకు పైగా పేద కుటుంబాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసి, ఆమోదం కోసం ఆర్థిక శాఖకు పంపింది. ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించి, నిధులు విడుదలైన వెంటనే కొత్త లబ్ధిదారులకు సబ్సిడీ అందనుంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 42.90 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి. 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఈ పథకంపై అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయగా, 'ప్రజా పాలన' కార్యక్రమం ద్వారా దాదాపు 91.49 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం తొలి దశలో 42.90 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. ఈ లబ్ధిదారుల గ్యాస్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం ఎర్షిక బడ్జెట్‌లో రూ. 723.30 కోట్లు కేటాయించింది.

రాష్ట్రంలో 1.20 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నప్పటికీ, తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గతంలో వివాహం చేసుకొని కొత్తగా కాపురం పెట్టిన జంటలకు వేరుగా రేషన్ కార్డులు లేకపోవడం, ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు ఉన్నా ఒకే కార్డు ఉండటం వంటి కారణాలతో చాలామంది అర్హులు పథకానికి దూరమయ్యారు. అయితే, ప్రభుత్వం 2025 జనవరి నుంచి 2026 జులై మధ్య కాలంలో పెద్ద ఎత్తున కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. ఈ కొత్త రేషన్ కార్డులు పొందిన వారు మహాలక్ష్మి పథకం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన పౌరసరఫరాల శాఖ, 5 లక్షలకు పైగా కుటుంబాలను అర్హులుగా నిర్ధారించింది. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రాగానే ఉమ్మడి జిల్లాల వారీగా కొత్త లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం సబ్సిడీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

# హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు

- సరూర్‌నగర్‌కు వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- నియామక ఈవెంట్‌లో తీవ్ర తోపులాట, ఉద్రిక్త వాతావరణం
- లాఠీచార్జ్‌తో గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- ఉద్యోగాల కోసం వస్తే నిరుద్యోగ విద్యార్థులను అవమానిస్తారా?
- నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాల్సిందే
- 'విద్యార్థులు, నిరుద్యోగులపై రేవంత్‌కు అంత కక్ష్య ఎందుకు? : హరీశ్ రావు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో శనివారంనా జరిగిన ఘటనే నిదర్శనం. తెలంగాణలో సంచలనం సృష్టిస్తూ నిత్యం హాట్ టాపిక్‌గా మారిన 'హైడ్రా'లో ఉద్యోగాల కోసం ప్రకటించిన 150 పోస్టులకు వేలాది మంది యువత ఒక్కసారిగా తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు. అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాలకే ఈ స్థాయిలో పోటీ ఉందంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఉద్యోగాల కోసం వస్తే నిరుద్యోగులను అవమానిస్తారా? : హరీశ్ రావు**

హైడ్రా డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను అవమానించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు.

**'విద్యార్థులు, నిరుద్యోగులంటే కక్ష ఎందుకు?**

అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు? అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైంది?' అని ప్రశ్నించారు.

'రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. జాబ్స్ ఇవ్వడం లేదు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి.. నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు. ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలి. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

# పోక్సో కేసులో షాక్.. క్రీడాకారునిపై వేటు

## తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ నుంచి పృథ్వీశ్వర్ సస్పెన్షన్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ బాస్కెట్ బాల్ జనరల్ సెక్రటరీ పృథ్వీశ్వర్ రెడ్డిపై పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. లైంగిక ఆరోపణల కేసులో పృథ్వీశ్వర్‌ను తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్(టీబీఏ) సస్పెండ్ చేసింది. టీబీఏ అత్యవసర సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పృథ్వీశ్వర్‌పై చర్యలు తీసుకున్నట్లు బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు(బీఎఫ్ఐ) అసోసియేషన్ లేఖ పంపించింది. అలాగే, జాయింట్ సెక్రటరీగా ఉన్న విష్ణు కుమార్ గౌడ్‌ను జనరల్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు టీబీఏ ప్రకటించింది.

ఫిర్యాదు చేసినప్పటికి పోక్సో కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయడం లేదని బాధితురాలి తల్లిదండ్రులు డీజీపీ, సీపీకి ఫిర్యాదు చేశారు. పోక్సో కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంపై వారు తీవ్ర అభ్యంతరం తెలిపారు. నిందితుడు పృథ్వీశ్వర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాస్కెట్ బాల్‌లో ఎంతో భవిష్యత్తు ఉన్న క్రీడాకారిణిపై వేధింపులు జరగడంతో బాలిక తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతోందని డీజీపీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు టీబీఏలో నిందితుడు పృథ్వీశ్వర్ భారీగా ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణల నేపథ్యంలో.. ఈ వ్యవహారంపై బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విచారణ జరుపుతోంది.

# బీఆర్ఎస్ నేతలకు హరీశ్ పరామర్శ

- దేవీప్రసాద్, క్యామ మల్లేశ్ ఇంటికి వెళ్లిన బీఆర్ఎస్ నేత



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** స్వల్ప అనారోగ్యంతో కోలుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ అధ్యక్షుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. ఈ మేరకు దేవీప్రసాద్ నివాసానికి వెళ్లిన హరీశ్ .. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్‌ను సైతం హరీశ్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మల్లేశ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజల్లోకి రావాలని హరీశ్రావు ఆకాంక్షించారు. ఈ పరామర్శల్లో మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ నృత్యాలతో మరిడమ్మ జాతర




**ఏలేశ్వరం,ఆగస్టు 8(మనం న్యూస్):** ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారిపై గల మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస జాతర మహోత్సవాల సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. గ్రామీణ కలలకు అద్దం పట్టే సంప్రదాయ గరగనూర్యాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతర మహోత్సవాలలో తీన్మార్ తో పాటు నవశక్తి వేషధారణలు అలరించాయి.

# ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న బిజెపి

## రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు



తిరుమలగిరి, ఆగస్టు 8 (మనం న్యూస్): గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం రైతుల, గ్రామీణ పేద కూలీల, కార్మికుల, శ్రామిక మహిళల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద ప్రజల నడ్డి విరుస్తుందనీ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ తెలంగాణ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైలుభరో కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిరావు మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని నీరుగార్చే విధంగా ఉన్నటువంటి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అక్రమంగా తీసుకువచ్చిన విత్తన చట్టాలను, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు బహుళ జాతి కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. ప్రజల ఆహార భద్రతను, ప్రజలకు పని కల్పించి ఉపాధి అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవడానికి జిబి గ్రామ్ జి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఆ బాధ్యతను కేంద్రం రాష్ట్రాల పై తోసేసే కొత్రకు వడిగట్టిందని అన్నారు. కానీ పల్లెల్లో పేద ప్రజల ఉపాధి పని భద్రతను కాపాడడంలో భాగంగా వామపక్షాలు పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. జిబి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దానిలో భాగంగానే జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి హైవే పై ఈనెల 10 న అఖిలభారత రైతు సంఘం, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహింస్తామని చెప్పారు. జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు ప్రజాతంత్ర వాదులు రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కడారి లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మట్టిపల్లి లక్ష్మి, వనం సోమయ్య, పడమటింటి నగేష్, సిఐటియు నాయకులు ఆనుగంటి శ్రీనివాస్, కొమ్ము సోమయ్య, సిపిఎం నాయకులు బూర్గుల ప్రభాకర్ పులిమామిడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నీటికి ఇబ్బందే

- నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు త్రాగునీటికి సరిపోతుంది
- రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్గొండ, ఆగస్టు 8 (మనం ప్రతినిధి ): ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుండి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయకుండా ఆరు తడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందు కష్ట కాలంలో అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉందని, శ్రీశైలం నుండి నీరు వచ్చినప్పటికి పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు .ఏ ఎం ఆర్ పి కూడా సగమే నిండిందని ,గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి లేదని, రాబోయే రోజుల్లో సూపర్ ఎల్ నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడి లో భాగంగా 33 వేల ఎకరాలలో వరికి వదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని ,అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరు తడి పంటలు వేయించాలన్నారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్ఫార్మర్ల పై ఉన్న ఓవర్ లోడ్ ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామాగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినప్పటికి నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని, ఎఎం ఆర్పీ, ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లేముల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, కరువు వచ్చినా సరే శ్రీశైలం డెడ్ స్టోరేజ్ లో ఉన్నప్పటికీ ఎస్ఎల్బీసీ నుండి సాగునీరు అందించవచ్చన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్ట కాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని,దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకు పనికిరాకుండా పోతాయని, విపరీతంగా ఎరువులు వాడడం, నిరంతరం వరి సాగు చేయటం వల్ల భవిష్యత్ లో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఎం ఎల్ సి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో సాగునీటికి మరింత ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల పంట మార్పిడి పై రైతుల వద్దకు వెళ్లి చెప్పాల్సిన అవసరం ఉందని ,ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసి రైతులను చైతన్యం చేయాలని, ఈ సంవత్సరం వర్షాలు తక్కువ ఉన్నందున పంట మార్పిడి కింద మెట్ట పంటలు వేసుకునే విధంగా చైతన్యం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల వర్షాలు లేనందున ప్రాజెక్టుల్లో కూడా సరైనంత నీరు లేదని, రానున్న రోజుల్లో పై నుండి సాగునీరు వచ్చే అవకాశాలు లేవని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో రైతులు వేసుకోబోయే పంటలు, తాగునీరు, ఇతర సౌకర్యాలపై చర్చించి ప్రణాళిక రూపొందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ లో కూడా సూపర్ ఎల్ నినో ప్రభావం ఉంటుందని ఉత్తర తెలంగాణకు మాత్రమే అక్కడక్కడ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాకు వర్షాలు లేవన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ,రైతులు పంటల మార్పిడిలో భాగంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఆగస్టు 15 వరకు మాత్రమే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యం చేయాలని కోరారు . మున్సిపాలిటీలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ను ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,హాలియా ,నిడమనూరు పిఏ సి ఎస్ అధ్యక్షులు, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు హాజరయ్యారు కాగా ప్రాజెక్టులు, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, విద్యుత్ అధికారులు డిఆర్డిఓ ప్రస్తుతం సాగునీటి పరిస్థితి, పంటలు, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ పై సమావేశానికి వివరించారు.

# సాగర్ ఎస్సారెస్పీ ప్రాజెక్టులో సాగునీటి కటకట

- రైతులతో మాట.. పంట మార్పిడి బాట
- ఆరుతడి పంటలపై రైతులు దృష్టి పెట్టాలి
- పదిమంది అన్నదాతలకు ఒక్కో అధికారి అవగాహన కల్పించాలి
- ఇతర పంటల సాగుపై ప్రభుత్వ సహకారం
- వర్షాభావ పరిస్థితి పై అన్నదాతలు అవగాహనతో సాగు చేయాలి
- ఈనెల 10వ తేదీన నాగార్జునసాగర్ లో ముఖ్యమంత్రి రేవంత్ వరుణ యాగం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మందుల సామెల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్



సూర్యాపేట ఆగస్టు 08 (మనం ప్రతినిధి) నాగార్జునసాగర్ 312 టీఎంసీలకు 137 టీఎంసీలు అలాగే శ్రీరామ్ సాగర్ లలో 8 టీఎంసీల నీటి నిలువతో డెడ్ స్టోరేజ్ ఏర్పడిందని ఇందులో నిల్వ ఉన్న నీరు కేవలం ప్రజల దాహార్తి తీర్చేందుకు త్రాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని అందించే అవకాశం ఉన్నందున ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు కి నీటి కరువు ఏర్పడిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ స్పష్టం చేశారు. శనివారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ ఆర్ ఎస్ పి. ఆయకట్టు కింద ఉన్న రైతులకు కనీసం 90 రోజులపాటు పంట సాగుకు నీ అందించాల్సి ఉందని అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో భారీగా వర్షం కురిసి 10 రోజుల్లో నీటిమట్టం పెరిగితేనే రైతులకు సాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఆగస్టు 15 వరకు నీరు సాగు అందజేయలేమని తెలియజేశారు. ప్రస్తుత వర్షాల పరిస్థితి చూస్తే సాగునీటి కరువు తీవ్రంగా ఏర్పడిందని ఇప్పటికే జూన్. జూలై. నెలల్లో ఎప్పుడు పడే వర్షపాతం కంటే సాధారణ వర్షపాతం నమోదయిందని దీంతో వర్షపాతం భారీగా తగ్గిందని ఇది ఇలాగే కొనసాగి ఆగస్టు సెప్టెంబర్ లో రైతుల పంట సాగు కి తీవ్ర నీటి కటకట ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ ఆగస్టు సెప్టెంబర్ మాసాలలో వరుణ దేవుడు కనికరించి భారీగా వర్షాలు కురిస్తే వరి సాగు కి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని రైతులకు తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వర్షపాతాన్ని అంచనా వేసుకుని రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఆయా గ్రామ మండలాలలో భూమి సాగు కు అనుకూలం బట్టి కంది. పెసర. మినుములు. వేరుశనగ. మిర్చి ఆముదాలు. కొన్నిచోట్ల పత్తి పండించుకుని విధంగా రైతులు ప్రత్యామ్నాయ పంట ఏర్పాట్లు చేసుకోవాలని దీంతో ఆరుతడి పంటపై ప్రభుత్వం రైతులకు ఎంతో సహకారం అందిస్తుందని వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితిలో మూసి కెనాల్ ప్రాంతంలో మాత్రమే సాగునీటి అవకాశం ఉందని జిల్లాలో 1125 చెరువులు 35వేల ఎకరాలు సాగు బోరు పై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. వరి పంటలకు ప్రస్తుత పరిస్థితులు అనుగుణంగా లేదని విషయాన్ని గ్రామపంచాయతీలో రైతు వేదికలకు ద్వారా గ్రామ మండలాలలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తున్నామని ... ఇందులో భాగంగా రైతులతో మాట.. పంటను మార్పిడి బాట .. అనే. ప్రోగ్రాం తో జిల్లా అధికార యంత్రాంగం గ్రామ కార్యదర్శి మొదలుకొని వివిధ శాఖల మండల అధికారులు జిల్లా అధికారులతో కలిసి గ్రామ మండల జిల్లా స్థాయి నుండి ప్రతి 10 మంది రైతులకు ఒక అధికారిని నియమించి ఆరుతడి పంటలపై అవగాహన కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని ఇందులో మీడియా ప్రతినిధులుగా మీ సహకారం ఎంత అవసరమని జిల్లా కలెక్టర్ కోరారు. ఆయా ప్రాంతాల నేలను బట్టి కందులు జొన్న పెసర. వేరుశనగ తోపాటు కూరగాయలు సైతం పండించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే కందులు పెసర ఇతర పంటల సంబంధించి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని. 99.758 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలకు అంచనా వేయడం జరిగిందని గత 2025 వర్షాకాలం 4.94. వేల వరి సాగు. 250 ఎకరాలు కంది. 10. 242 పెసర.300. మినప.1000. ఎకరాల్లో మిర్చి వేసే అవకాశం ఉందని. మరికొందరు రైతులు ఏ పంట సాగు చేయాలో అని వేచి చూసి దూరంలో ఉన్నారని కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

**సాగు భూమిలేని రైతులను ఆదుకుంటాం ఎమ్మెల్యే మందుల**

జిల్లాలో ప్రస్తుత ప్రతికూల ఋతుపవనాల కారణంగా వర్షాకాల ప్రభావం కారణంగా సాగు భూమి లేని రైతుల్ని ఆదుకునేందుకు. వారికి ఉచిత బియ్యం పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ స్పష్టం చేశారు. జిల్లాలో ఇరిగేషన్ సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈనెల ఆగస్టు 15 నుండి డిజిటల్ రేషన్ కార్డులను అర్హులైన ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎల్ నీ నో ప్రభావంతో రాబోయే కరువును అధిగమిస్తామని ఎమ్మెల్యే చెప్పుకోచారు. అందుకు అనుగుణంగానే రైతు సోదరులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్ని అనుకూలంగా మలుచుకొని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని. ఈ ఆరుతడి పంటల సాగుపై ప్రభుత్వం రైతులకు విత్తన సరఫరా ఇతర సాగు విషయంలో సహ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీలా అభివృద్ధి చేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అత్యధిక వర్షం పడేవిధంగా వరుణ యాగం చేసేందుకు ఈ నెల 10 వ తేదీన నాగార్జునసాగర్ కి విచ్చేయనున్నారని తెలిపారు. ఈ వరుణ మహా యాగంలో ముఖ్యమంత్రి తో పాటు ఉమ్మడి జిల్లా చెందిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మంత్రులు పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటు ఇరిగేషన్ సివిల్ సప్లై వ్యవసాయ అధికారంతో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- సర్పంచ్ ప్రభాకర్

మహాదేవపూర్, ఆగస్టు 8 మనం న్యూస్ : అన్నారం గ్రామంలో నిర్వహించనున్న ఉచిత కంటి శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ప్రభాకర్ కోరారు. శనివారం నాడు ఆయన ఒక ప్రకటనలో అన్నారం గ్రామంలో ఈ నెల 10వ తేదీ సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ లోని ప్రముఖ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరం ఉదయం నుంచి ప్రారంభం కానుందని ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, కంటి సంబంధిత సమస్యలపై వైద్యుల సలహాలు, అవసరమైన మందుల ఉచిత పంపిణీ చేపట్టనున్నారని అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందుబాటులో ఉన్న కంటి పరీక్షలు, చికిత్సలపై మార్గదర్శకత్వం అందించనున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు, వృద్ధులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు. అన్నారం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యమైన చూపు ఆనందమైన జీవితం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నీర్ల ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# డీయస్సీ సక్రమమేనని లోకేష్ నిరూపించుకోవాలి



- లేదంటే మంత్రిపదవికి రాజీనామా చేయాలి
- పురం వైసీపీ ఇన్చార్జ్ దీపిక

చిలమత్తూరు, ఆగస్ట్ 08, మనం న్యూస్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అవకతవకలు జరగలేదని, అంతా సక్రమమేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత మంత్రి నారా లోకేష్ పై ఉందని హిందూపురం వైయ్యస్సార్ సీపీ ఇన్చార్జ్ దీపికమ్మ డిమాండ్ చేశారు. డీయస్సీ 2025 అక్రమాలపై సిబిఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలో వైయ్యస్సార్ సీపీ చేపట్టిన నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. చిలమత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దీపికమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్వహించింది మెగా డీయస్సీ కాదు.. దగా డీయస్సీ అంటూ దుమ్మెత్తిపోశారు. నియామకాల్లో అవకతవకలు జరగకపోతే దర్యాప్తుకు ఎందుకు బయపడుతున్నారని ప్రశ్నించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. లోకేష్ కష్టపడి చదివి డిగ్రీలు పొంది ఉంటే ఆ బాధ విలువ తెలిసేదని ఏద్దేవా చేశారు. డీయస్సీ మెరిట్ లిస్ట్ దాచేసి ప్రతిభావంతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ఇవ్వకుండా సెలెక్షన్ ఇవ్వడమేంటని అన్నారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ డీయస్సీపై సిబిఐతో దర్యాప్తు చేయించి, తన సచ్చీలతను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేణురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ జయశంకరరెడ్డి, ఎంపీటీసీలు ఆదినారాయణప్ప, రఘునాథ్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, మాజీ కన్వీనర్ మదిపి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ సంధ్య, దివాకర్ రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, చిన్నప్పయ్య, అయూబ్, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు



# చేనేతలకు ఉచిత కంటి వైద్యం శుభదాయకం

- శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఆగస్టు 8 నుంచి 22 వరకు వైద్య సేవలు

ధర్మవరం, ఆగస్టు 8, మనం న్యూస్: చేనేత కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్బీఐ కాలనీలోని మధు కంటి వైద్యశాలలో రిటైర్డ్ కంటి అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకారపు నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శనివారం మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల నుంచి విరమణ పొందిన అనంతరం కూడా డాక్టర్ నరసింహులు ప్రజల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వివిధ వర్గాల వారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. చేనేత కార్మికుల కోసం ఆగస్టు 8 నుంచి 22వ తేదీ వరకు కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. నేత కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయో గకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ మహిళా నాయకురాలు సంకారపు జయశ్రీ, చేనేత నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, ఆగస్టు 8 మనం న్యూస్: జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, క్రమబద్ధంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఇతర జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలు, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను వెంటనే చేపట్టి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి సమన్వయ లోపం చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.జెండా ఆవిష్కరణ, సెరిమోనియల్ పరేడ్, గార్డ్ ఆఫ్ హానర్, డ్రోన్ పర్యవేక్షణ, ట్రాఫిక్ మేనేజ్మెంట్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పోలీస్ శాఖ సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. తమ తమ శాఖల పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాటు, డెకరేషన్, తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, పరిశ్రమలు, ప్రాథమిక రంగం తదితర ముఖ్య శాఖలకు సంబంధించిన శకటాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం/ప్రదర్శన నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.పతాకాలు, ఫ్లాగ్ పోల్స్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఐటీ సంబంధిత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని మీడియా కవరేజ్, సమాచార ప్రసారం, కార్యక్రమ వివరాల అందజేత తదితర ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ఫొటోగ్రఫీ, సర్టిఫికెట్ల పంపిణీ తదితర అంశాలను కూడా సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు.ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించి, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు.

# సింగరేణి యాజమాన్యం 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే వేయాలి

- ఈనెల 10న జీఎం కార్యాలయం ముందు ధర్నా
- జాతీయ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్
- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు



భూపాలపల్లి ఆగస్టు 8 మనం న్యూస్: సింగరేణి యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం వెంటనే 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని వేసి వేగంగా అమలుపరచాలని ట్రేడ్ యూనియన్ జాతీయ సంఘాల నాయకులు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సి ఐ టి యు సి నాయకులు మంద నర్సింగరావు, ఐ ఎన్ టి యు సి నాయకులు జోగబుచ్చయ్య, హెచ్ ఎం ఎస్ నాయకులు నరేష్ నేత లు డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కొమురయ్య భవన్ లో జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కోల్ ఇండియా వ్యాప్తంగా 12వ పేజీ బోర్డు కమిటీ వేయాలని కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఈనెల 10న జిఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు పిలుపునిచ్చారు. గతంలో 11వ వేజ్ బోర్డు ఆరు నెలల ముందే వేజ్ బోర్డు కమిటీ వేసిన కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు 12వ వేజ్ బోర్డు సమయం దాటిన కమిటీ ఎందుకు వేయడం లేదని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. కలకత్తాలో కోల్ ఇండియా వ్యాప్తంగా ఏర్పాటుచేసి 12వ వేజ్ బోర్డు విషయం మాట్లాడకుండా లేబర్ కోడలు అమలు గురించి మాట్లాడడం పై కార్మిక సంఘాలు మండిపడ్డాయి. ఏ పరిశ్రమలో లేనంతగా సింగరేణి బొగ్గు రంగంలో కార్మిక కోడ్ లను అమలు చేయడంపై వారు మండిపడ్డారు. లేబర్ కోడ్ ల పేరుతో ఇంతవరకు 12వ పేజీ బోర్డుపై మాట్లాడకుండా కాలయాపన చేస్తున్న కార్మిక సంఘాలు ఆగ్రహించి కోల్ ఇండియా వ్యాప్తంగా ఈనెల 10న అన్ని జీఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బి ఎం ఎస్ పాల్గొనక పోవడం దురదృష్టకరమని, వేజ్ బోర్డు విషయంలో వారు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా సెప్టెంబర్12 న రాంచీలో జరిగే సదస్సులో వేజ్ బోర్డు విషయంపై స్పష్టత రాకుంటే కోల్ ఇండియా వ్యాప్తంగా సమ్మె తప్పదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఇప్పటికైనా వెంటనే వేజ్ బోర్డు కమిటీని వేయాలని జిఎం కార్యాలయాల ముందు సోమవారం జరిగే ధర్నా కార్యక్రమానికి కార్మికులు ట్రేడ్ యూనియన్ సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చెందర్, ఐలయ్య, బీమనాదుని సత్యనారాయణ, రామచందర్, సిఐటియు నాయకులు దుడ్డేల సాయిలు,రమేష్, హెచ్ఎంఎస్ నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

# ముగింపు దశకు చేరుకున్న సర్ ప్రక్రియ

## జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



భూపాలపల్లి ఆగస్టు 8 మనం ప్రతినిధి : రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలోని ఓటర్లందరికీ ఇది చివరి అవకాశం అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూరించిన ఎన్యూమరేషన్ ఫారం సమర్పించడానికి ఆగస్టు 10 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, ఎవరైతే ఓటర్లు ఇంకనూ తమ ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వలేదో బూత్ లెవల్ ఆఫీసర్ ను సంప్రదించి, పూరించిన ఫారాన్ని డిజిటలైజేషన్ కొరకు సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఆగస్టు 10 లోగా ఫారం సమర్పించని పక్షంలో, ఆగస్టు 17 న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు నమోదు కాబడదని తెలిపారు. ఓటర్లు తమ ఫారాన్ని సులభంగా ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని తెలిపారు. సహాయం కోసం ఉచిత ఓటర్ హెల్ప్లైన్ నంబర్: 1950 మరిన్ని వివరాల కోసం మీ సంబంధిత బూతు స్థాయి అధికారులకు ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, వెంటనే ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బూతు స్థాయి అధికారులకు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

# అదుపు తప్పిన ఆర్టీసి బస్సు



కాటారం, ఆగష్టు 8 మనం న్యూస్: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తూరుపల్లి మహాదేవపూర్ మార్గం మధ్యలో జాతీయ రహదారి పై శనివారం ఆర్టీసీ బస్సుకు ప్రమాదం చోటుచేసుకుంది. కాటారం నుంచి కాళేశ్వరం వెళ్తున్న ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఆకస్మాత్తుగా గారేపల్లి వైపు రివర్స్ తిరిగి రహదారి పక్కకు దూసుకెళ్లింది. ఒక్కసారిగా ఉలిక్కిపడిన ప్రయాణికులు కేకలు వేశారు. బస్సు అదుపు తప్పడంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 25 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదని ప్రయాణికులు తెలిపారు.

# పాలకుల నిర్లక్ష్యం వల్ల నీరు అందడం లేదు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి ఆగష్టు 8 మనం న్యూస్: పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు నీరు అందడం లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశించిన స్థాయిలో వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు,సాగునీటి అవసరాల కోసమే దేవాదుల ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం నెలకు 6 టి.ఎం.సి ల నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా, 9 పంపులు నడవాల్సిన చోట 6 లేదా 7 మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. పదవులు పొందిన పాలకుల నిర్లక్ష్యం వల్లే రైతులకు నీళ్లు అందడం లేదన్నారు.రామప్ప నుంచి గ్రావిటీ ద్వారా గణపురం చెరువుకు నీటిని తీసుకురావడానికి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 18 కోట్లు వెచ్చించి నిర్ణయం తీసుకున్నాం, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కనపడేసిందని, నీటిని తెచ్చే మార్గం ఉన్నా, పంటలను ఎండబెట్టడం బాధాకరమని వెంటనే గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నీరు అందించడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం సరికాదని ఎద్దేవా చేశారు.

# పాలకవర్గాల విలాసాలకు కోట్ల ప్రజాధనం

- పేదోడి గూటికి కంటితుడుపు సాయమా?
- ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలపై తిరుగుబాటు తప్పదు
- తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య హెచ్చరిక



మల్హార్ . ఆగస్టు. 8. మనం. న్యూస్ః రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అసంబద్ధ నిబంధనలతో వారి పాలిట శాపంగా మారిందని తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అయితే బాపు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం మలహలరావు మండలం కొయ్యూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాలను తక్షణమే పునఃసమీక్షించాలని అయితే బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన లేవనెత్తిన ప్రధాన అంశాలు, డిమాండ్లు మంత్రుల విలాసాలకు లేని బడ్జెట్.పేదలకూ దక్కదా? పాలకులు తమ బంగ్లాలు, చివరకు బాత్రూమ్ల నవీకరణ (రిపేర్ల) కోసం రూ. 20 లక్షల ప్రజాధనాన్ని అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారూ , కానీ అజ్ఞాతంలో నివసించే నిరుపేద కుటుంబానికి కేవలం రూ. 5 లక్షలు కేటాయించడం దారుణమని విమర్శించారు. నేటి ధరల ప్రకారం లేబర్ చార్జీలు, నిర్మాణ సామగ్రి విపరీతంగా పెరిగినందున ఇంటి నిర్మాణ వ్యయాన్ని కనీసం రూ. 10 లక్షలకు పెంచాలని స్పష్టం చేశారు. గుడిసె పరిమాణం సరిపోదు - 1000 చ.అడుగులకు విస్తరించాలి: 400 నుండి 600 చదరపు అడుగుల లోపే నిర్మాణం ఉండాలనడం పేదలను ఇరుకు గదుల్లో బంధించడమేనని బాపు దుయ్యబట్టారు. భవిష్యత్తు తరాల అవసరాలను దష్టిలో ఉంచుకుని ఈ స్థల పరిమితిని కనీసం 1000 చదరపు అడుగులకు సవరించాలని సూచించారు. వడ్డీల ఊబిలో లబ్ధిదారులు: అరకొర నిధులు, నిబంధనల పేరుతో బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యం వల్ల పేదలు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కంటితుడుపు చర్యలు స్వస్తి పలికి, డిమాండ్లను డేగకన్నుతో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, జిల్లా వ్యాప్తంగా అన్ని సంఘాలను ఏకం చేసి భారీ ఎత్తున పోరాటాలకు దిగుతామని అయితే బాపు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, యుఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు. ఆదివాసి మహిళా నాయకురాలు కాలినేని రాజమణి. పాల్గొన్నారు.

# జయశంకర్ జిల్లాలో జన్-జీ తరహా నిరసనలు



- రోడ్లపై నీటి గుంటలో చాపల కోసం వలలు విసిరిన యువత

భూపాలపల్లి ఆగస్టు 8 మనం న్యూస్: భూపాలపల్లి జిల్లాలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సుభాష్ కాలనీకి వెళ్లే రహదారిపై వర్షపు నీరు భారీగా నిల్వ ఉండటంతో బీఆర్ఎస్ యువజన నాయకులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. చాపలు పట్టే వలలు తీసుకొచ్చి నిల్వ ఉన్న నీటిలో చేపలు పట్టినట్లుగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సుభాష్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారని, ఈ పనుల కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించారని బీఆర్ఎస్ యువజన నాయకులు ఆరోపించారు. ఎన్నికల్లో ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు ఆ హామీని విస్మరించారన్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఈ రహదారిపై నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వాహన దారులు నిత్యం సమస్యలు ఎదు ర్కొంటున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, నిల్వ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినూత్న నిరసన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# నేడు వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- బంజారా కమిటీ పిలుపు



హనుమకొండ, ఆగష్టు 8(మనంన్యూస్)ః నేడు రాంపూర్ మామిడి తోటలో నిర్వహించనున్న బంజారా వనభోజన కార్యక్రమానికి బంజారా బంధుమిత్రులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు, కార్మికులు, మేధావులు, రాజకీయ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు బంజారా ముద్దుబిడ్డలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వనభోజన కార్యక్రమ కమిటీ సభ్యులు కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బంజారా బంధుమిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. రేపు ఉదయం 9 గంటలకు రాంపూర్ మామిడి తోటలో వనభోజన కార్యక్రమం ప్రారంభం కానుందని, ఈ సందర్భంగా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేలా భారీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఒకరోజు ఆనందంగా గడపడంతో పాటు, మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను పరిరక్షించుకోవడం, యువతలో బంజారా సంస్కృతిపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన ప్రకృతి మధ్య నిర్వహించే ఈ వనభోజనం ద్వారా ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలిసి ఉంటే కలదు సుఖం అనే భావనతో బంజారా బంధుమిత్రులందరూ ఐక్యంగా, కలిసిమెలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని మన బంజారా జాతి ఐక్యతను చాటాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కావున ఆగస్టు 9వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు రాంపూర్ మామిడి తోటకు కుటుంబ సమేతంగా తరలివచ్చి, వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బంజారా వనభోజన కార్యక్రమ విన్ నాయక్ కిషన్ నాయక్ వెంకట్ నాయక్ గోపీసింగ్ నాయక్ రాజు నాయక్ శాంబు నాయక్ వీరన్న నాయక్ రమేష్ నాయక్ సోము నాయక్ ఈర్య నాయక్ వసంత్ నాయక్ లు కోరారు.

# ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



మహాదేవపూర్, ఆగస్టు 8 మనం న్యూస్ః మహాదేవ్పూర్ మండలంలోని కాళేశ్వరం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని శనివారం నాడు ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించగా ఈ సమావేశ ముఖ్య అతిథి గా జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాం బాబు మాదిగ హాజరై మాట్లాడుతూపద్మశ్రీ మందకృష్ణ మాదిగ సమాజంలో ప్రతి పేద కుటుంబానికి ఉపయోగపడే విధంగా ఎన్నో పోరాటాలు చేసి సమాజంలో అన్ని వర్గాల పేద వర్గాలకు ఫలాలు అందించారు జాతి సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికి కూడా ఎమ్మార్పీఎస్ శక్తివంతలేకుండా పాటుపడడం ఎమ్మార్పీఎస్ లక్ష్యం అన్నారు పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రావు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం మని అన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి కాళేశ్వరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రాబోవు రోజుల్లో సామాజిక ఆర్థిక అసమానతపై మరో పోరాటానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని రేపు సమాజానికి మాదిగ జాతి సామాజిక ఉద్యమానికి దిక్సూచిలా ఉండేలా ఉద్యమం నిర్మాణం జరగాలని అన్నారు కాళేశ్వరం గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు లేతకరి అవినాష్ ఉపాధ్యక్షుడు లేతకరి భాస్కర్ ,ప్రధాన కార్యదర్శి లేతకరి రాజశేఖర్, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అలాగే ఎంఎస్పి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా లేతకరీ రాజబాబును నియమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతకుంట్ల సదానందం, లేతకరి రాజయ్య, లేతకరి రాజు, సమ్మయ్య.. గ్రామ నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

# ఆటో ప్రయాణికుల భద్రతకు డిజిటల్ రక్షణ కవచం...

## క్యూఆర్ కోడ్తో డ్రైవర్, వాహన వివరాలు తెలుసుకునే అవకాశం

## ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకుండా.. వృత్తికి గౌరవం పెంచడమే లక్ష్యం: మంత్రి సత్యకుమార్

ధర్మవరం, ఆగస్టు 8, మనం న్యూస్: ఆటో ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆటో రిక్షాల డిజిటల్ రిజిస్ట్రేషన్, క్యూఆర్ కోడ్ ఆధారిత భద్రతా విధానాన్ని శనివారం ధర్మవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకరిద్దరి తప్పిదాల కారణంగా రాష్ట్రంలోని దాదాపు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకూడదన్నారు.ఆటోల్లో డ్రైవర్, యజమానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డుతో పాటు రెండు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గూగుల్ లెన్స్ ద్వారా క్యూఆర్ కోడ్ను స్కాన్ చేస్తే డ్రైవర్, యజమాని వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అవసరమైతే వాటిని ప్రింట్ తీసుకోవడం, కుటుంబ సభ్యులు, స్నేహితులకు వాట్సప్ ద్వారా షేర్ చేసుకునే అవకాశం




ఉంటుందని వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఉన్న ప్రాంతాన్ని పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానం చేసే ట్రాక్ లోకేషన్ సదుపాయం ఉంటుందన్నారు. డ్రైవర్ సేవలపై ప్రయాణికులు రేటింగ్ ఇవ్వడంతో పాటు ఆటోలో వస్తువులు మరిచిపోయినా, ప్రయాణంలో ఇబ్బంది ఎదురైనా క్యూఆర్ కోడ్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయడం, సమీప పోలీస్స్టేషన్, అధికారుల ఫోన్ నంబర్లు తెలుసుకునే సదుపాయం కూడా ఉంటుందని చెప్పారు.

# కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ప్రజలకు అవగాహన



హిందూపురం, ఆగష్టు 8(మనం న్యూస్)ః హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు సంతెబిదునూర్ గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న పభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవడంతో పాటు, గ్రామంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను సేకరించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులు వివరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏలు శ్రీనివాస్, బాలాజీ, హిందూపురం రూరల్ మండల కన్వీనర్ హెచ్.ఎన్. రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆశ్వత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. ఆనంద్ కుమార్తో పాటు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుటుంబ సమస్యలు స్నేహపూర్వకంగా పరిష్కరించాలి




- ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ను పరిశీలించిన ఎస్పీ సతీష్కుమార్

ధర్మవరం, ఆగస్టు 8, మనం న్యూస్ః కుటుంబ వివాదాలను సానుభూతితో, నిష్పాక్షికంగా పరిష్కరించి ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన మార్గాన్ని చూపాలని జిల్లా ఎస్పీ సతీష్కుమార్ సూచించారు. ధర్మవరం టౌన్ సర్కిల్ పోలీస్స్టేషన్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ను శనివారం ఆయన సందర్శించారు.కౌన్సెలింగ్కు హాజరవుతున్న ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, కుటుంబ వివాదాల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానం, కేసుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల ఫిర్యాదుల స్వభావం, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. సమస్యలను పరిష్కరించే సమయంలో ఇరు పక్షాల అభిప్రాయాలను సమగ్రంగా తెలుసుకుని, సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కౌన్సెలింగ్ కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం కౌన్సెలింగ్ సెంటర్లోని రికార్డులు, కేసుల పురోగతి, నిర్వహణ తీరును ఎస్పీ పరిశీలించారు. కౌన్సెలింగ్కు హాజరైన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి కుటుంబ సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు. కుటుంబ సమస్యలు పోలీస్స్టేషన్ స్థాయిలోనే స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారమయ్యేలా కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథరావు, సీఐ రెడ్డప్ప, న్యాయవాది త్రిపుర సుందరి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు చలపతి, పాత్రికేయుడు రాఘవ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల11 మంగళవారం సర్వసభ్య సమావేశం

కాత్రేనికోన ఆగష్టు 8 మనం ప్రతినిధిః కాత్రేనికోన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశము ఆగస్టు 11 మంగళవారం ఉదయం గం. 10:30 నిమిషాలకు ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో బి రాజేశ్వరరావు తెలియజేశారు ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ ల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావలసినదిగా తెలియజేశారు సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలియజేశారు సమావేశానికి గైర్హాజరు అయిన అధికారులు మరియు సిబ్బంది వివరాలు జిల్లా కలెక్టర్ వారికి నివేదిక సమర్పించడం జరుగుతుందని కావున సమావేశాన్ని అత్యంత ప్రాధాన్యం కలిగినదిగా భావించాలనిఎంపీడీఓ తెలియజేశారు.

# అంతర్జాతీయ సెయిలింగ్‌లో తెలంగాణ ఆణిముత్యాలు!

## ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కామారెడ్డి గురుకుల విద్యార్థిని రిష్వితకు రజతం

### ఇటలీలో ముగిసిన ప్రతిష్టాత్మక పోటీలు

**హైదరాబాద్, ఆగస్టు 8 (మనం న్యూస్):** అంతర్జాతీయ క్రీడావేదికపై తెలంగాణ గురుకుల విద్యార్థిని ఘనకీర్తిని ఆర్జించింది. ఇటలీలో జరిగిన ప్రతిష్టాత్మక 'సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ (ప్రమోషనల్ క్లాస్)'లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థిని



ఎస్.రిష్విత రజత పతకంతో మెరిసింది. జూలై 30 నుంచి ఆగస్టు 7 వరకు ఇటలీలోని గార్డా సరస్సు వేదికగా ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. కామారెడ్డి ఎం.జె.పి.టి గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రిష్విత.. అంతర్జాతీయ స్థాయి నావికులతో పోటీపడి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. రిష్విత సాధించిన అద్భుత విజయంపై కామారెడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.మాధవి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల్లోని అంకితభావం, కఠోర శ్రమ,సమయపాలనతో పాటు సమిష్టి కృషే అంతర్జాతీయ వేదికపై మన రాష్ట్రానికి, దేశానికి ఈ అరుదైన గుర్తింపు తెచ్చిపెట్టిందని కొనియాడారు. ముఖ్యంగా ఎం.జె.పి.టి సంస్థ సెక్రటరీ బి.సైదులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక అంశాలపై శిక్షణ ఇప్పించారని, ఆయన ప్రోత్సాహం వల్లే ఇలాంటి పెద్ద పోటీల్లో మన విద్యార్థులు అవకాశాలు అందుకోగలుగుతున్నారని పేర్కొంటూ సెక్రటరీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు మరెంతో మంది యువ నావికులకు (సెయిలర్లకు) స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు ఇది నాంది పలుకుతుందనిఆశాభావం వ్యక్తం చేశారు.

**మంత్రి పొన్నం హర్షం:** అంతర్జాతీయ వేదికపై రజత పతకంతో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన రిష్వితపై ప్రశంసల జల్లు కురుస్తోంది. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రిష్వితకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. బి.సి.సంక్షేమ శాఖ కార్యదర్శి (సెక్రటరీ) బి.సైదులు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఆర్సీఓ సత్యనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ పి.మాధవి తో పాటు పాఠశాల అధ్యాపక, సిబ్బంది బృందం రిష్వితకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్



ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డే క్రికెట్ లో మూడు సార్లు ఆరు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన తొలి స్పిన్నర్ గా చరిత్రకెక్కాడు. ఐర్లాండ్ తో జరిగిన రెండో వన్డేలో 7.4 ఓవర్లలో 34 పరుగులకు 6 వికెట్లు పడగొట్టి ఈ రికార్డు సృష్టించాడు.

రషీద్ 2017లో తొలిసారి ఆరు వికెట్ల ప్రదర్శన (ఐర్లాండ్ పైనే) నమోదు చేశాడు. అదే ఏడాది విండీస్ పై 7-18 ప్రదర్శన నమోదు చేసి రెండోసారి ఈ ఘనత సాధించాడు. తాజాగా ఐర్లాండ్ పై మరోసారి 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసి, వన్డే క్రికెట్ లో మూడోసారి ఈ ఘనత సాధించిన తొలి స్పిన్నర్ గా చరిత్ర సృష్టించాడు.

ఓవరాల్ గా వన్డేల్లో అత్యధిక సార్లు 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన రికార్డు పాక్ స్పీడ్ స్టర్ వకార్ యూనిస్ పేరిట ఉంది. వకార్ ఏకంగా ఐదుసార్లు 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. స్పిన్ విభాగంలో రషీద్ తర్వాతి స్థానంలో వనిందు హసరంగ (2) ఉన్నాడు.

పేస్ విభాగంలో వకార్ తర్వాతి స్థానంలో ట్రెంట్ బౌల్ట్ (2) ఉన్నాడు. భారత్ తరపున ఆశిష్ నెహ్రా వన్డేల్లో రెండుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శనలు నమోదు చేశాడు. రషీద్ ఖాన్ వన్డేల్లో ఇప్పటివరకు ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు చేశాడు. టెస్ట్ ల్లో ఐదు సార్లు, టీ20ల్లో రెండు సార్లు ఈ ఘనత సాధించాడు.

ఇదిలా ఉంటే, రషీద్ స్పిన్న మాయాజాలం దెబ్బకు రెండో వన్డే ఐర్లాండ్ పై ఆఫ్ఘనిస్తాన్ 92 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ జట్టు 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేయగా.. ఐర్లాండ్ 33.4 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది.

తడి ఔట్ ఫీల్ కారణంగా ఈ మ్యాచ్ ను తలో 47 ఓవర్లకు కుదించారు. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ ఐదు మ్యాచ్ ల సిరీస్ లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ సిరీస్ లోని తొలి వన్డే వర్షం కారణంగా తుడిచిపెట్టుకు పోయింది. మూడో వన్డే బెల్ ఫాస్ట్ వేదికగా ఆగస్ట్ 10న జరుగనుంది.



## శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్..

# రెండో రోజు ముగిసిన ఆట

శ్రీలంక క్రికెట్ ఎలెవన్, భారత్ మధ్య జరుగుతున్న మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ లో రెండో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ను శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేయగా.. తర్వాత బ్యాటింగ్ కు దిగిన టీమ్ఇండియా శనివారం ఆట ముగిసే సమయానికి 357/6 స్కోరుతో నిలిచింది. భారత్ ఇంకా ఆరు పరుగుల వెనుకంజలో ఉంది. దేవదత్ పడిక్కల్ (142*; 137 బంతుల్లో 14 ఫోర్లు) శతకంతో ఆకట్టుకున్నాడు. పడిక్కల్ తోపాటు గుర్నూర్ బ్రార్ (36*; 18 బంతుల్లో) క్రీజులో ఉన్నాడు. నాలుగో స్థానంలో వచ్చిన రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్; 117 బంతుల్లో) రాణించగా.. కేఎల్ రాహుల్ (40; 67 బంతుల్లో), మానవ్ సుతార్ (41; 90 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. సరాంశ్ జైన్ (22) రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. యశస్వి జైస్వాల్ ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్ గా వెనుదిరగ్గా.. రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆట చివర్లో గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్ లో నాలుగు సిక్స్ లు బాదేశాడు. శ్రీలంక బౌలర్లలో రమేశ్ మెండిస్ 2, అసంక మనోజ్ 2, కేసర నువాంత, విశ్వ ఫెర్నాండో ఒక్కో వికెట్ పడగొట్టారు.

## లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం

అర్జెంటీనా స్టార్ ఫుట్బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి ఇంట్లో విషాదం నెలకొంది. మెస్సి తండ్రి జార్జ్ మెస్సి (68) దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అర్జెంటీనాలోని తన స్వస్థలమైన రోసారియోలో శుక్రవారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) కన్నుమూశారు. లియోనెల్ కెరీర్ను తీర్చిదిద్దడంలో జార్జ్ కీలకపాత్ర పోషించారు. చిన్ననాటి నుంచి అంతర్జాతీయ సాకర్ దిగ్గజంగా ఎదిగే వరకు మార్గనిర్దేశం చేశారు. జార్జ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని మెస్సి కుటుంబం జూన్లో ఒక ప్రకటన విడుదల చేసింది. ఫిఫా ప్రపంచ కప్ సమయంలో జార్జ్ మరణించినట్లు వార్తలు రాగా.. కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.



# రామాయణ.. రిలీజ్‌లో కొత్త ట్విస్ట్



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ'. ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్ లో ముందుగా.. ఆ తర్వాత భారత్ లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. ''నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి (నవంబర్ 8) రోజే విడుదల చేస్తాం'' అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్ బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

# డేటింగ్ రూమర్స్.. మృణాల్ స్పందన ఇది



సినిమా సెలబ్రిటీలకు సంబంధించి ఎప్పటికప్పుడు రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. అలా రీసెంట్ టైంలో హీరోయిన్ మృణాల్ ఠాకుర్ గురించి ఒకటి బయటకొచ్చింది. భారత యంగ్ క్రికెటర్ యశస్వి జైస్వాల్ తో డేటింగ్ లో ఉందని అన్నారు. ముంబైలోని ఓ కాఫీ షాప్ లో జంటగా కనిపించారని పుకార్లు తెగ అల్లేశారు. ఇప్పుడు దీనిపై స్వయంగా మృణాల్ స్పందించింది. కామెంట్ పెట్టి క్లాస్ పీకింది.

తను-జైస్వాల్ వైరల్ వీడియోకు సంబంధించి ఓ ఇన్ స్టా ఖాతాలో పోస్ట్ కనిపించగా.. దానికి మృణాల్ కామెంట్ పెట్టింది. ఒకేచోట కనిపించినంత మాత్రాన ఇద్దరి మధ్య సంబంధం ఉందని ఎలా భావిస్తారు? అలా ఎలా అనుకుంటారు? అని ప్రశ్నించింది. 'బ్రో రిలాక్స్.. మేమిద్దరం కలిసి ఎక్కడ కనిపించాం? మీరు ఇంత చదువుకున్నవాళ్లు కానీ ఇలాంటి పుకార్లను నిజమని ఎలా నమ్ముతున్నారు? దేశంలో ఎన్నో విషయాలు జరుగుతున్నాయి. జెన్-జీ నుంచి కొంత నేర్చుకోండి. సరైన సమస్యలపై వీడియోలు చేయండి. అప్పుడు మరిన్ని వ్యూస్ వస్తాయి' అని మృణాల్ కామెంట్ చేసినట్లు ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇది రూమర్ కి స్పందించినట్లు లేదు. చిన్నపాటి క్లాస్ పీకినట్లు ఉంది.

అయితే మృణాల్ పై డేటింగ్ రూమర్స్ ఇదేం కొత్త కాదు. తమిళ హీరో ధనుష్ తో డేటింగ్ లో ఉందని, వాలంటైన్స్ డే నాడు పెళ్లి కూడా చేసుకోబోతున్నారని తెగ మాట్లాడుకున్నారు. తీరా చూస్తే అవన్నీఒట్టి పుకార్లు మాత్రమేనని తేలిపోయింది. ఈ బ్యూటీ కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాది ఈమె నుంచి మూడు సినిమాలొచ్చాయి. వాటిలో 'డెకాయిట్' అనే తెలుగు మూవీ ఉంది. త్వరలో 'పూజా మేరీ జాన్' అనే ఓటీటీ చిత్రంలో కనిపించనుంది.

# అందరినీ కలిపి క్రేజీ సాంగ్ ప్లాన్ చేసిన అనీల్ రావిపూడి!



విక్టరీ వెంకటేష్ అలాగే నందమూరి కళ్యాణ్ రామ్ లు హీరోలుగా కీర్తి సురేష్, కృతి శెట్టిలు హీరోయిన్స్ గా బ్లాక్ బస్టర్ దర్శకుడు అనీల్ రావిపూడి కలయికలో మరో సాలిడ్ మల్టీస్టారర్ తెరకెక్కుతున్న సంగతి అందరికీ తెలిసిందే. మళ్ళీ సంక్రాంతికి మరో సాలిడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్లాన్ చేస్తున్న ఈ చిత్రాన్ని మేకర్స్ శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

ఇలా ప్రస్తుతం సినిమాపై ఇంట్రెస్టింగ్ రిపోర్ట్ ఇపుడు తెలిసింది. మేకర్స్ ప్రస్తుతం 'గుంటూరు కారం' హౌస్ షూట్ లో అది కూడా ఓ క్రేజీ సాంగ్ షూట్ లో బిజీగా ఉన్నట్టు కన్ఫర్మ్ అయ్యింది. ఈ సాంగ్ షూట్ లో మొత్తం నలుగురు స్టార్స్.. వెంకీ మామ, కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ అలాగే కీర్తి సురేష్ లు పాల్గొననున్నారు.

జీవి ప్రకాష్ మంచి ఎనర్జిటిక్ ట్యూన్ అందించినట్టు తెలుస్తుంది. ఇక ఈ షెడ్యూల్ ఈ ఆగస్ట్ 20 వరకు కొనసాగనుందట. సో మొత్తానికి ఇలా షూట్ సూపర్ ఫాస్ట్ గా పూర్తవుతుంది. ఇక ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ అలాగే షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# యంగ్‌గా కనిపించాలనే తాపత్రయం నాకు లేదు: మాధవన్



సినిమా రంగంలో వయసు మళ్లే కొద్దీ నటీనటులు తమ లుక్స్ ను కాపాడుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఆర్. మాధవన్ మాత్రం దీనికి పూర్తి భిన్నమైన ఆలోచనతో ఉన్నారు. వయసు పెరగడాన్ని, తెల్ల జుట్టును తాను ఆనందంగా ఆస్వాదిస్తానని తెలిపారు. తెర వెనక సహజంగా ఉండడమే తనకు ఇష్టమని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ''నాకు అబద్ధాలు చెప్పడం రాదు. తెల్ల జుట్టు దాచడానికి ఇష్టపడను. సినిమాలో పాత్ర కోసం అవసరమైతే తప్ప.. ఎప్పుడూ జుట్టుకు రంగు వేసుకోను. ఈ విషయాన్ని నేను రజనీకాంత్ నుంచి నేర్చుకున్నాను. ఆఫ్ స్క్రీన్ లో ఎలా కనిపిస్తున్నారనే విషయాన్ని ఆయన అస్సలు పట్టించుకోరు. కానీ స్క్రీన్ పై మాత్రం మ్యాజిక్ చేస్తారు. నా మిత్రుడు అజిత్ కుమార్ కూడా అంతే'' అని చెప్పారు.

''కెరీర్ పరంగా ప్రస్తుతం చాలా ప్రశాంతంగా ఉన్నాను. వయసులో చిన్నవాడిగా కనిపించాలనే తాపత్రయం నాకు లేదు. ఇండస్ట్రీలో నేను ఎవరితోనూ పోటీ పడడం లేదు. నాలోని నటనను మరింత మెరుగుపరుచుకోవడంపైనే నా పోటీ. నేను ఎలా ఉన్నానో నన్ను నేను మనస్ఫూర్తిగా ఇష్టపడతాను'' అని మాధవన్ అన్నారు. విభిన్న కథాంశాలను ఎంచుకునే మాధవన్.. తాజాగా భారతీయ ఎడిసన్ గా పేరుగాంచిన గోపాలస్వామి దొరైస్వామి నాయుడు అలియాస్ జి.డి.నాయుడు బయోపిక్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కృష్ణకుమార్ రామ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో మాధవన్ మెప్పించారు.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.